# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :295 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 05-02-2025 | పేజీలు:4 వెల: 2.00


## నందిగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో మరో ట్విస్ట్

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో మరో ట్విస్ట్ వచ్చి చేరింది.. ఎమ్మెల్యేగా తాను సూచించిన కౌన్సిలర్ సత్యవతి పేరు పై బీఫామ్ వస్తుందని ఆశించారు తంగిరాల సౌమ్య..అయితే, ఎమ్మెల్యే సౌమ్యకు మరోసారి షాక్ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ అధిష్టానం.. ఎమ్మెల్యే సూచించిన పేరు.. ఎంపీ సూచించిన పేరు కాకుండా మధ్యే మార్గంగా పదో వార్డు కౌన్సిలర్ మండవ కృష్ణ కుమారి పేరు మీద బీఫామ్ అధిష్టానం పంపడంతో ఎమ్మెల్యే సీరియస్ అయ్యారు.. కౌన్సిలర్లను తీసుకొని నేరుగా ఎన్నిక జరిగే జగజ్జీవన్ రామ్ భవనంకు చేరుకున్నారు.. బీఫామ్ లేకుండా 14వ వార్డు కౌన్సిలర్ సత్యవతితో నామినేషన్ వేసేందుకు సిద్ధం అయ్యారు.. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించిన 14వ వార్డు కౌన్సిలర్ సత్యవతికి కౌన్సిలర్లు మద్దతు ఇచ్చే అవకాశం ఉందని.. బీఫామ్ లేదు కాబట్టి ఇండిపెండెంట్‌గా సత్యవతి చైర్మన్ అయ్యే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది..మరోవైపు.. మంత్రి నారాయణ నుండి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు ఫోన్ వచ్చిందట.. ఎమ్మెల్యే, ఎంపీ సూచించిన అభ్యర్థి కాకుండా అధిష్టానం సూచించిన పేరును

## వక్ఫ్ బిల్లుపై అసదుద్దీన్ ఒవైసీ వార్నింగ్



హైదరాబాద్,వక్ఫ్ సవరణ బిల్లు 2024ను పార్లమెంట్ ముందుకు ఈ బడ్జెట్ సమావేశాల్లోనే మోదీ ప్రభుత్వం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ ఎంపీ, ఆల్ ఇండియా మజ్లీస్ ఇ-ఇత్తేహదుల్ ఇస్లామీన్ అధినేత అసుద్దీన్ ఒవైసీ హెచ్చరించారు. బిల్లు ఆమోదం పొందితే దేశంలో సామాజిక అస్థిరతకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లును మొత్తం ముస్లిం సమాజం తిరస్కరించిందని ఒవైసీ చెప్పారు. సోమవారం ఆయన పార్లమెంట్ ఎదుట మీడియాతో మాట్లాడుతూ.. వక్ఫ్ బిల్లును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తేల్చిచెప్పారు. "నేను ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను.. ప్రతిపాదన వక్ఫ్ చట్టాన్ని తీసుకొస్తే అది రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26, 14లను ఉల్లంఘిస్తుంది.. ఈ దేశంలో సామాజిక అస్థిరతకు దారితీస్తుంది. దీనిని మొత్తం ముస్లిం సమాజం తిరస్కరించింది.. వక్ఫ్ ఆస్తులు ఏమీ ఏదీ మిగలవు" అని అన్నారు.'మీరు దేశాన్ని వికసిత్ భారత్'గా మార్చాలనుకుంటున్నారు.. మేము 'వికసిత్ భారత్'ను కోరుకుంటున్నాం మీరు ఈ దేశాన్ని 80లు.. 90ల ఆరంభంలోకి తీసుకెళ్లాలనుకుంటే అది మీ బాధ్యత' అని మోదీ ప్రభుత్వానికి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. 'గర్వించదగ్గ భారతీయ ముస్లింగా నేను మసీదులో అంగుళం స్థలం కూడా వదులుకోను.. నా దర్గాలో ఇంచు భూమిని కోల్పోను%ా% దీనికి నేను అనుమతించను మేము ఇకపై ఇక్కడికి వచ్చి మెతక ప్రసంగాలు చేయం మేము భారతీయులగా గర్విస్తున్నాం నా సమాజం కోసం నిలబడి నిజాయితీగా మాట్లాడాల్సిన సభ ఇది.. ఇది నా ఆస్తి, ఎవరూ ఇవ్వలేదు. అని ఒవైసీ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులో 'వక్ఫ్ బై యూజర్ (దీర్ఘకాలం వక్ఫ్ బోర్డు వినియోగంలో ఉండే ఆస్తి దానికే శాశ్వతంగా సంక్రమిస్తుంది. కోర్టుల్లో సవాల్ చేయడానికి వీల్లేదు)' అనే నిబంధనను తొలగించడాన్ని ఒవైసీ వ్యతిరేకించారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నోటీసులు



హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు తాఖీదులు అందాయి. కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎమ్మెల్యేలకు శాసనసభ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలంటూ అందులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ వేసిన అనర్హత పిటిషన్ ఆధారంగా శాసన కార్యదర్శి నరసింహా చార్యులు మంగళవారం నోటీసులు పంపించారు. అయితే వివరణ ఇచ్చేందుకు తమకు సమయం కావాలంటూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కోరారు. 2024 మేలో జరిగిన పార్లమెంటు ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దానం నాగేందర్, కడియం శ్రీహరి, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్, ప్రకాశ్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. అయితే స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆయనకు తగిన ఆదేశాలివ్వాలని కోరుతూ హైకోర్టు, సుప్రీంకోర్టులను బీఆర్ఎస్ నేతలు ఆశ్రయించారు. ఇటీవలే బీఆర్ఎస్ పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు.. తగిన సమయం అంటే ఎంత అంటూ ప్రశ్నించింది. నిర్దిష్ట సమయం చెప్పాలంటూ శాసనసభ కార్యదర్శిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ సెక్రెటరీ నరసింహా చార్యులు నోటీసులు ఇచ్చారు.బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన ఏడుగురు ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీచేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టీ ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం సంజయ్‌కుమార్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్‌చంద్రన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. అనంతరం ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీచేసింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని గతంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను, తాజాగా కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కలిపి విచారిస్తామని ధర్మాసనం పేర్కొన్నది. ఈ పిటిషన్లను తెలంగాణ స్పీకర్ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీకి అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది.

## చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వంతో రిటైర్మెంట్ ఉద్యోగులకు ఇబ్బందులు



హైదరాబాద్,ఫిబ్రవరి4: చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ప్రతి ఒక్కరు ఇబ్బందులు పడుతున్నారని, దీనిలో భాగంగానే రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులూ తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. ఈ పోలీస్ అధికారి ఆవేదన చూస్తే హృదయం కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 30 ఏళ్లకు పైగా ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించిన ఠాగూర్ నారాయణ సింగ్ ఇలాంటి పరిస్థితుల్లో ఉండటం చాలా బాధాకరమని హరీష్‌రావు వాపోయారు. ఒకవైపు ఆ అధికారి రెండు కిడ్నీలు చెడిపోయి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, మరోవైపు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య భద్రత కార్డుతో చికిత్స చేయించుకుందామని ఆస్పత్రికి వెళ్తే ఆ కార్డు చెల్లదని పంపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ఈ విశ్రాంత పోలీసు ఉద్యోగికి శాపంగా మారిందని హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఒక నారాయణ సింగ్ సమస్య కాదని.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రిటైర్డ్ అయిన 8000 మంది ప్రభుత్వ ఉద్యోగుల జీవన్మరణ సమస్య అని చెప్పారు. రేవంత్ రెడ్డికి ఉద్యోగుల పట్ల ఏమాత్రం ప్రేమ ఉన్న వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వైద్యసేవలు పొందడంలో అంతరాయం కలగకుండా ఈహెచ్ఎస్, పోలీస్ ఆరోగ్య భద్రత కార్డులు ఆస్పత్రుల్లో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## నా ఇంట్లోనూ కేసీఆర్ ఫొటో ఉంది.. ఉంటే తప్పేంటి?



హైదరాబాద్: అధికార కాంగ్రెస్ పార్టీలో (కాంగ్రెస్) నానాటికీ అసమ్మతి గళాలు పెరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ మంత్రికి వ్యతిరేకంగా పది మంది ఎమ్మెల్యేలు నిర్వహించిన రహస్య సమావేశం విషయం తెలిసిందే. ఉమ్మడి వరంగల్‌కు చెందిన మరో ముగ్గురు వారికి తోడవడంతో ఆ సంఖ్య 13కు చేరింది. మంత్రుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిర్వహించిన సమావేశం ఓ ఎమ్మెల్యే. తాజాగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన హైడ్రా, ఆపరేషన్ రోప్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి తన అసంతృప్తిని అసెంబ్లీ వేదికగా బయటపెట్టారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశం సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..పేదల ఇండ్లు కూల్చుతామంటే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హైడ్రా, అధికారుల విషయంలో కూడా వెనక్కి తగ్గేది. తాను కాంప్రమైజ్ కాలేదు.. కాబోనని చెప్పారు. ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో సైతం అధికారుల విషయంలో తాను కాంప్రమైజ్ కాలేదని. పోతే జైలుకు పోతా.. నాపై 173 కేసులు ఉన్నాయని చెప్పారు. తన ఇంట్లో వైఎస్సార్, కేసీఆర్ ఫొటోలు ఉన్నాయి. వారి ఫొటోలు ఉంటే తప్పేంటి. నాయకుల విషయంలో ఎవరి అభిమానం వాళ్లది అంటూ చెప్పుకొచ్చారు. ఇక పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు పంపిన నోటిఫికేషన్ ప్రస్తావిస్తూ.. ఇప్పటివరకు తనకు ఎలాంటి నోటీసులు రాలేదు.. వచ్చాక సూచించానన్నారు.కాగా, పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కేసీఆర్ ఫొటో ఉండటంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలుపొందిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి.. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కేసీఆర్ ఫొటోను తొలగించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన స్థానిక కాంగ్రెస్ నాయకులు.. కార్యాలయంపై దాడిచేసి కేసీఆర్ చిత్రపటాన్ని తొలగించి. ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఫొటోను పెట్టారు. ఈ నేపథ్యంలోనే నాయకుల ఫొటోలపై ఎమ్మెల్యే దానం నాగేందర్ పై విధంగా వ్యాఖ్యలు చేశారు.

## బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు సింగరేణి ప్రోత్సాహకాలు



గోదావరిఖని : సింగరేణి సంస్థలో 2024- 25 ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న రెండు నెలలకు గాను నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించడానికికార్మికులకు యజమాన్యం ప్రోత్సాహక బహుమతులను ప్రకటించింది. 1 ఫిబ్రవరి నుంచి మార్చి 31 వరకు ప్రోత్సాహక బహుమతులు కార్మికులకు నగదు రూపేనా అందజేయనున్నట్లు యజమాన్యం స్పష్టం చేసింది. భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ గనులు, సిహెచ్ పిలలో పనిచేసే కార్మికులకు నగదు ప్రోత్సాహకాలు లభించనున్నాయి. మార్చితో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికి గాను రెండు నెలల్లో 18.27 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి వెనుకబడి ఉంది.ఈ ఉత్పత్తి సాధించడానికి కార్మికులకు నగదు రూపేనా ప్రోత్సాహకాలు అందించనున్నట్లు యజమాన్యం స్పష్టం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా జనవరి 31 నాటికి 53.73 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే జరిగింది. ఫిబ్రవరి, మార్చి నెలలో భారీగా బొగ్గు ఉత్పత్తి జరిగితేనే నిర్దేశిత లక్ష్యాలు సాధ్యమవుతాయి. దీనికి గాను యజమాన్యం రెండు విధాలుగా నగదు ప్రోత్సాహకాలను చెల్లించనుంది.మొదటి విధానంలో ఏరియా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి. రెండో విధానంలో లక్ష్యాన్ని అధిగమించడం చేస్తే ప్రోత్సాహక బహుమతి లభిస్తుంది. 100 నుంచి 104% బొగ్గు ఉత్పత్తి సాధిస్తే ప్రతి కార్మికుడికి 1500 రూపాయలు 105% నుంచి 109% సాధిస్తే 2000 రూపాయలు 110 అంతకన్నా ఎక్కువ బొగ్గు ఉత్పత్తి సాధిస్తే 2500 రూపాయలు నగదు ప్రోత్సాహకంగా చెల్లించనున్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని కార్మికులు అధికంగా శ్రమించి అధిక బొగ్గు ఉత్పత్తి కోసం కృషి చేయాలని సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి చేస్తున్నది.

## బండికి బీజేపీ పగ్గాలు...ఈటెలకు కేంద్ర మంత్రి ?



హైదరాబాద్,తెలంగాణలో ఈసారి ఎలాగైనా పాగా వేయాలని బీజేపీ జాతీయ నాయకత్వం గట్టిదలగా ఉంది. దాంతో తెలంగాణా బీజేపీ అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలి అన్న దాని మీద తీవ్రమైన కసరత్తు చేస్తోంది. తాజాగా చూస్తే కేంద్ర అధినాయకత్వం బండి సంజయ్ వైపు మొగ్గు చూపుతోంది అని అంటున్నారు. ఆయన గతంలో మూడేళ్ళ పాటు ఈ కీలకమైన పదవిని నిర్వహించి పార్టీకి ఎంతో జోష్ ని తెచ్చారు.అంతే కాదు స్థానిక సంస్థల ఎన్నికల్లో హైదరాబాద్ కార్పొరేషన్ లోనూ అత్యధిక సీట్లు బీజేపీ గెలుచుకునేలా చేశారు. ఆయన చాలా అగ్రెసివ్ మోడ్ లో ఉంటారు. ఆయన దూకుడు రాజకీయాలకు పెట్టింది పేరు. ఆయన డైరెక్ట్ ఎటాక్ చేస్తారు. ఏ విషయం మీద అయినా కుండబద్దలు కొట్టినట్లుగా మాట్లాడుతారు. దానికి ఉదాహరణ గద్దర్ కి పద్మ అవార్డులు ఇవ్వడం మీదనే అని గుర్తు చేస్తున్నారు.ఆయన బీజేపీ భావజాలాన్ని జనంలోకి విస్తృతంగా చేర్చడంలో కీలకమైన పాత్ర పోషించారు. చాలా ప్రాంతాలకు బీజేపీ బండి నాయకత్వంలోనే పరిచయం అయింది అన్నది హైకమాండ్ గుర్తించింది అని అంటున్నారు. నిజానికి 2023 చివరిలో తెలంగాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వేళకు బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉండాల్సింది. కానీ పార్టీలోని కొందరి ప్రమేయం వల్లనే ఆయనను తప్పించి కిషన్ రెడ్డికి బాధ్యతలు ఇచ్చారు.ఆ మీదట బండి సంజయ్ లోక్ సభ ఎంపీగా గెలవడం కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం జరిగిపోయాయి. అయితే ఆయనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పీఠం మీదనే మనసు ఉందని అంటున్నారు. ఆయనకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆశీస్సులు నిండుగా ఉన్నాయని అంటున్నారు.ఇక ఇటీవల తెలంగాణాలో నిర్వహించిన కుల గణనలో అత్యధిక శాతం బీసీలు ఉన్నారని లెక్క తేలింది. దాంతో బీసీల నుంచే కొత్త అధ్యక్షుడు వస్తారని కూడా ప్రచారంలో ఉంది. తెలంగాణాలో అత్యధిక శాతం ఉన్న మున్నూరు కాపులు అయిన బీసీల నుంచి కీలక నేతగా ఉండడం బండి సంజయ్ కి కలసి వస్తున్న మరో అంశంగా చెబుతున్నారు.దాంతో ఆయనకే అధ్యక్ష కిరీటం దక్కుతుందని అంటున్నారు. ఇక ఈ పదవి కోసం పోటీ పడుతున్న మరో బీసీ నేత అయిన ఈటెల రాజేందర్ కి కేంద్ర మంత్రి పదవి లభిస్తుంది అని అంటున్నారు. ఆయన పార్టీలో చేరాక ఊపు వచ్చిందని ఆయనకు మరింత ప్రోత్సాహం కల్పిస్తే కచ్చితంగా తెలంగాణాలో బీఆర్ఎస్ కి పట్టున్న ఏరియాలు కూడా కమల వికాసానికి దోహదపడతాయన్న అంచనాలు ఉన్నాయట.దాంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని పూర్తి స్థాయిలో ప్రభుత్వ పరంగా బాధ్యతలు చూసేలా చేస్తూ ఈటెల బండిలకు పదవులు అప్పగించాలని కమల నాథులు డిసైడ్ చేసినట్లుగా భోగట్టా. అయితే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం మరో ఎంపీ రఘునందనరావు. అలాగే మాజీ మంత్రి డీకే అరుణ సహా ఇతర ముఖ్య నేతలు పోటీ పడుతున్నారు. వారికి ఏ పదవులు దక్కుతాయో చూడాల్సి ఉంది.

## తెలంగాణలో కులగణన సర్వే పూర్తిగా నిస్పాక్షికంగా జరిగింది



హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే పూర్తిగా నిస్పాక్షికంగా జరిగిందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ సర్వేను ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో నిర్వహించిందని స్పష్టం చేశారు.పొన్నం ప్రభాకర్ వెల్లడించిన వివరాల ప్రకారం, హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో 100% సర్వే పూర్తయింది. అయితే, హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లో కొంతమంది కావాలని సర్వేకు దూరంగా ఉన్నారని చెప్పారు. అంతేకాదు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో సర్వే అధికారులపై కొందరు కావాలని కుక్కలు వదిలారని ఆయన తెలిపారు. కుల గణన సర్వేపై అనవసర అపోహలు పుట్టించవద్దని పొన్నం ప్రభాకర్ సూచించారు. బీసీలను మరింత బలపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బీసీల గురించి ఎవరు మాట్లాడినా, వారిని చులకన చేయొద్దని తెలిపారు. తమ ప్రభుత్వానికి బీసీలకు అన్యాయం చేసే ఉద్దేశం లేదని, ఏ పని చేసినా పూర్తి చిత్తశుద్ధితో చేస్తామన్నారు. అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశంకు హాజరైన నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశం కావడంలో తప్పేమీ లేదని, తమ పార్టీ నేతలు కలిసి చర్చించడం సహజమని తెలిపారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశమైతే తప్పా?" అని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు సమావేశం కావడాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేదని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఇతర పార్టీ నేతలతో సమావేశమైతే తప్పు అని చెప్పొచ్చని, కానీ తమ పార్టీ నాయకుల భేటీని తప్పుబట్టడం అనుచితం అని వ్యాఖ్యానించారు. అనురుద్ రెడ్డి తనకు ఫోన్ చేసినప్పటికీ, తాను ఆ సమావేశానికి హాజరుకాలేదని నాయిని రాజేందర్ రెడ్డి వెల్లడించారు. మరోవైపు అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం ప్రారంభమైంది. ఈ పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో మరిన్ని చర్చలకు దారి తీసే అవకాశముంది.

### చైనా సుంకాలపై దీటుగా స్పందించిన చైనా

బీజింగ్,అమెరికా విధించిన టారిఫ్‌లపై చైనా ప్రభుత్వం ధీటుగా స్పందించింది. అమెరికా నుండి దిగుమతయ్యే బొగ్గు, ఎల్ఎన్‌జి ఉత్పత్తులపై 15శాతం, ముడి చమురు, ఇతర ఉత్పత్తులపై పది శాతం సుంకాలను విధిస్తున్నట్లు చైనా ప్రభుత్వం తెలిపింది. కెనడా, మెక్సికో, చైనా దేశాల వస్తువులపై దిగుమతి సుంకాలను విధిస్తూ వాణిజ్య యుద్ధానికి ట్రంప్ తెరలేపిన సంగతి తెలిసిందే.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా అధిక టారిఫ్‌లను విధించడం ప్రపంచ వాణిజ్య సంస్థ డబ్ల్యుటిఒ నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ చర్య అమెరికా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోగా చైనా, అమెరికాల మధ్య నెలకొన్న ఆర్థిక, వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తుందని తెలిపింది. చైనా దిగుమతులపై ట్రంప్ విధించిన 10శాతం సుంకాలు మంగళవారం నుండి అమల్లోకి రానున్నాయి. యాంటీ ట్రస్ట్ చట్టాలను ఉల్లంఘిస్తోందనే అనుమానంతో అమెరికా టెక్ సంస్థ గూగుల్‌పైనా దర్యాప్తు చేపట్టినట్లు చైనా స్టేట్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ మార్కెట్ రెగ్యులేషన్ మంగళవారం పేర్కొంది. ట్రంప్ ఆదేశాలు అమల్లోకి వచ్చిన కొద్ది నిమిషాల తర్వాత చైనా ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది.

## సంపాదకీయం

బుధవారం 05-02-2025

## యమునా కాలుష్యం నివారణపై కానరాని చిత్తశుద్ధి !

ఢిల్లీ ఎన్నికల పుణ్యమా అని..యమునా కాలుష్యంపై మరోమారు పతాక శీర్షికలో వార్తలు చెలరేగాయి. ఈ విషయంలో ఇంతకాలం అటు ఢిల్లీ ప్రభుత్వం కానీ, ఇటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కానీ పట్టించు కోవడం లేదు. గంగా కాలుష్యం గురించి పదేళ్లుగా వల్లెవేస్తున్న మోడీ దానిని పునరుజ్జీవింపచేసే ప్రయత్నాలు పెద్దగా చేయడం లేదు. యమునా కాలుష్యానికి కారణం ఈ రెండు ప్రభుత్వాల నిర్లక్ష్యం తప్ప మరోటి కాదు. కాలుష్యాన్ని తొలగించే ప్రయత్నాలు చేస్తామని ఇరు పార్టీలు ఎక్కడా ప్రకటించలేదు. ప్రజలపై చిత్తశుద్ధి లేదనడానికి వీరి ప్రచార తీరే నిదర్శనం. ప్రధానంగా బిజెపి గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉంది. ఆప్ కూడా పదేళ్లుగా ఢిల్లీలో అధికారంలో ఉంది. అయినా ఈ సమస్యను పదేళ్లలో గుర్తించి చర్యలకు ఉపక్రమించలేదు. ఎక్కడా వీరికి చిత్తశుద్ధి కానరాలేదు. నీటి కాలులష్యాన్ని రాజకీయ కోణంలో చూపించి, లబ్ది పొందాలన్న దుగ్ధ రెండు పార్టీలది. వీరికి చిత్తశుద్ధి లేదని చెప్పడానికి ఇంతకన్నా పెద్ద ఉదాహరణ అక్కర్లేదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5న జరగనున్నాయి. ఈ క్రమంలో బిజెపిని దెబ్బతీసే ప్రయత్నంలో భాగంగా యమునా కాలుష్యంపై దుమారం రేపారు. అయితే దీనిపై చర్యలు తీసుకోవాల్సిన బిజెపి సహజంగానే ఎదురుదాడికి దిగింది. కేజ్రీవాల్ తీరును తప్పు పట్టింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పాగా వేసే ప్రయత్నంలో ఉన్న బిజెపి ఆప్ ను దెబ్బతీసేందుకు చేయని ప్రయత్నం లేదు. ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టి పార్టీ మారేలా చేస్తున్నారు. అలాగే యమున విషయంలో కూడా సానుకూలంగా స్పందించి కాలుష్యరహిత యమునను చేద్దామన్న సంకల్పం ప్రకటించలేదు. ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి ఆమ్ఆద్మీ పార్టీ, బిజెపి, కాంగ్రెస్ పోటీపడుతున్నాయి. ముఖ్యంగా ఆమ్ఆద్మీ పార్టీకి ఈసారి గెలిచే అవకాశం లేకుండా బిజెపి సర్వశక్తులూ ఒడ్డుతోంది.ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా, జెపి నడ్డాలు ప్రచారంలో దూకుడు పెంచారు. కేజ్రీవాల్‌పై విమర్శలు గుప్పించడంలో భాగంగా యమునా కాలుష్యంపై ఎదురుదాడికి తెగించారు. అలాగే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈసారి తమదే విజయమని ఢంకా బజాయిస్తున్నారు. మరోవైపు కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, యపి సిఎం యోగి ఆదిత్యానాథ్ తదితరులు ప్రచారం ముమ్మరంగా సాగిస్తున్నారు. ఈ తరుణంలో యమునా నదిపై రగడ ఆమ్ఆద్మీ, బిజెపి పార్టీల మధ్య వ్యవహారం రచ్చగా మారింది. యమునానది కాలుష్యం కావడానికి హర్యానా ప్రభుత్వమే కారణమని కేజ్రీవాల్ ఆరోపించడం రాజకీయ దుమారం రేపింది. యమునను విషతుల్యం చేశారని ఆరోపించారు. తాను బతికి ఉన్నంతవరకు యమునా నది నీటిని ఢిల్లీ ప్రజలు తాగకుండా చేస్తానని కూడా కేజ్రీవాల్ ప్రకటించారు. ప్రధాని తాగే నీటిలో ఎవరైనా విషం కలుపుతారా అంటూ కేజ్రీవాల్ తీరుపై ప్రధాని మోడీ మండిపడ్డారు. మొత్తంగా ఇదో ఎన్నికల ప్రచారాశంగా మారింది. అంతేగానీ యమునా కాలుష్య నివారణకు సవాళ్లుగా మారివుంటే బాగుండేది. కానీ అలా చేసే దమ్ము,ధైర్యం వీరికి లేదు. అయితే యమున కాలుష్యంపై వచ్చి లేదా చేసిన ఆరోపణలపై మాత్రం హర్యానా ప్రభుత్వంతోపాటు కేంద్రఎన్నికల కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఇది రెండు వర్గాల మధ్య శత్రుత్వాన్ని రెచ్చగొట్టడమవుతుందని, ఢిల్లీ జల్‌బోర్డు ఉద్యోగులు విషాన్ని ఎలా గుర్తిస్తున్నారో చెప్పాలని ఎన్నికల కమిషనర్ కోరారు. ఈ మేరకు కేజ్రీవాల్‌కు నోటీసులు పంపారు. యమునా నదిలో అమోనియా కలియడంవల్ల విషపూరితం కాకుండా నివారించ వలసిన బాధ్యత ఢిల్లీ ఆప్ ప్రభుత్వానిదేనని ఎన్నికల కమిషనర్ గుర్తుచేశారు. మరోవైపు హర్యానా సిఎం నయాబ్‌సింగ్ సైనీ యమునా నదిని తాగడం వైరల్ అయింది. ఆయన నీటిని తాగినట్టు నటించారే తప్ప అసలు తాగలేదని, నోట్లోని నీటిని వెంటనే ఉమ్మేశారని కేజ్రీవాల్ ఆరోపించారు. హర్యానా సిఎం నయాబ్ సింగ్ సైనీ యమునా నీటిని తాగి ఊసేసిన వీడియో క్లిప్‌ను కేజ్రీవాల్ పోస్టు చేశారు. అమోనియో కాలుష్యం కారణంగా యమునా నీరు ఢిల్లీ ప్రజలకు ప్రాణాంతకంగా మారిందన్న తనపై కేసు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని కేజ్రీవాల్ ధ్వజమెత్తారు. మొత్తంగా యమునానది కాలుష్య కాసారాంగా మారిందన్నది నిజం. అది తాగడానికి పనికి రానంతంగా తయారయ్యిందన్నది కూడా నిజం, ఈ విషయంలో ఇరు ప్రభుత్వాలు చేతగానితనాన్ని బయటపెట్టు కున్నాయి. ఏ పార్టీ అయినా, ప్రభుత్వమైనా, ప్రజల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేయాలి. సమస్య ఉత్పన్నం అయితే స్పందించి, పరిష్కార మార్గం చూపాలి. కానీ అలా జరగడం లేదన్నదే బాధ. తాగునీటి సమస్యను పరస్పరం భూతద్దంలో చూపించి ఓట్లవేట సాగించడం దుష్టరాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. ఇప్పుడు ఢిల్లీలో జరుగుతున్న యమునా నది రగడ కూడా అంతే. ఎన్నికలు వచ్చేవరకు యమునా నది సమస్య ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి పట్టలేదు. సమస్య ఉందని తెలిసి కూడా పట్టించుకోలేదు. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే కేజ్రీవాల్ యమునా నదిని ప్రక్షాళనం చేస్తామని ఓటర్లకు హామీ ఇచ్చారు. ఆ తరువాత ఈ సమస్యను విస్మరించారు. ఢిల్లీ ఒక్కటే కాదు...ప్రధాన నదులు కాలుష్యకాసారాలుగా మారాయి. అయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ సమస్యలపై చిత్తశుద్ధి లేని ఈ పార్టీలకు గట్టిగా బద్ధి చెప్పాల్సి ఉంది. నదుల కాలుష్యానికి తీసుకుంటున్నచర్యలను కేంద్రం వివరించాలి. ఏ మేరకు ఎలాంటి ప్రయత్నాలు చేశారో చెప్పాలి. ఎంతకాలంలో నదుల కాలుష్యాన్ని అరికట్టగలరో ప్రజలకు హామీ ఇవ్వాలి. అప్పుడే ప్రజలు నమ్మతారు.

# గిట్టుబాటు ధరలకు సహకారం



సమష్టిగా బేరసారాలు

హైదరాబాద్,రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పంటలు పండిస్తున్నా సరైన గిట్టుబాటు ధరలు లభించడంలేదు. చాలా పంటలకు కనీస మద్దతు ధరలు లేకపోవడంతో దళారులు చెప్పిన రేటుకే వాటిని తెగనమ్ము కోవాల్సి వస్తోంది. సాగుదారుల కష్టానికి తగిన ప్రతిఫలం లభించేలా ప్రభుత్వాలు తగిన ఏర్పాట్లు చేయాలి.రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పంటలు పండిస్తున్నా సరైన గిట్టుబాటు ధరలు లభించడంలేదు. చాలా పంటలకు కనీస మద్దతు ధరలు లేకపోవడంతో దళారులు చెప్పిన రేటుకే వాటిని తెగనమ్ము కోవాల్సి వస్తోంది. సాగుదారుల కష్టానికి తగిన ప్రతిఫలం లభించేలా ప్రభుత్వాలు తగిన ఏర్పాట్లు చేయాలి.గిరాకీ, సరఫరాల మధ్య తేడాలను బట్టి వస్తువుల ధరలు పెరగడమో, తగ్గడమో జరుగుతుంది. టమాటా వంటి పంటల దిగుబడులు అధికంగా ఉన్నప్పుడు ధరలు దారుణంగా పడిపోవడం చూస్తూనే ఉన్నాం. కానీ, సరఫరాకూ ధర పెరుగుదలకూ మధ్య మార్కెట్ మాయాజాలం ఉంటోంది. ఒక వస్తువు సరఫరా పది శాతం తగ్గిందనే వదంతి వచ్చిందంటే చాలు, దాని ధర ఏకంగా యాభై శాతం పెరిగిపోతుంది. ఇది ఎంతవరకు భావ్యం? దళారులకు లాభాలు తెచ్చిపెడుతున్న ఇలాంటి విపరీత పెరుగుదల వినియోగదారులు, రైతులకు మాత్రం తీవ్ర నష్టమే కలిగిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులు పచ్చి సరకులు కాబట్టి త్వరగా చెడిపోతాయి. పైగా సీజన్ బట్టి వాటి దిగుబడులు మారుతుంటాయి.

ఇతర దేశాల్లో ఇలా...

వ్యవసాయ మండీల్లో ఉత్పత్తుల వేలం వల్ల ధరలపై అదుపు వ్యాపారుల చేతికి వెళ్తుంది. రైతులు నిస్సహాయంగా చూడటం తప్ప చేసేదేమీ ఉండదు. రైతులకు బేరమాడే శక్తిని పెంచడానికి వారు మండీల వెలుపల పంటలను అమ్ముకోవడానికి వీలుగా ఏపీఎంసీ చట్టాన్ని సవరించారు. ఈ చట్టం పరిధి నుంచి కొన్ని పంటలను మినహాయించారు. అయినాసరే, రైతులకు బేరమాడే శక్తి పెరగలేదు. రైతు తనకు గిట్టుబాటయ్యే ధరకు పంటను అమ్ముకొనే స్వేచ్ఛ ఉండాలి. అందుకు తగిన యంత్రాంగాన్ని నెలకొల్పాలి. అంతేగాని, మార్కెట్ దయాదాక్షిణ్యాలకు అన్నదాతలను వదిలేయకూడదు. ఈ అనిశ్చితి నుంచి రక్షణ కోసం అన్ని పంటలకూ కనీస మద్దతు ధర చెల్లించాలని రైతులు చాలాకాలంగా ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. వివిధ కారణాల వల్ల వారి డిమాండ్ పూర్తిగా నెరవేరడం లేదు. అమెరికాలో రైతులను మార్కెట్ ఒడుదొడుకుల నుంచి కాపాడటానికి 1968లో వ్యవసాయంలో న్యాయబద్ధ విధానాల చట్టం తీసుకొచ్చారు. పంటలను రైతులు వ్యక్తిగతంగా పండిస్తారు కాబట్టి వారికి సమష్టిగా బేరమాడే శక్తి ఉండదు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే వారు సహకార పద్ధతిలో ముందుకెళ్లాలి. అమెరికాలో 1968నాటి చట్టం అందుకు వీలు కల్పించింది. దాని కింద టమాటా, బాదం తదితర పంటల రైతులు మార్కెట్‌లో మంచి ధరల కోసం గట్టిగా బేరమాడటానికి వ్యవసాయ మండళ్లను ఏర్పాటు చేసుకున్నారు. ఆస్ట్రేలియాలో కాంపిటిషన్ కమిషన్ పూర్తిగా వ్యవసాయ మార్కెట్ల కోసం ప్రత్యేక డైరెక్టర్‌ను నియమిస్తుంది. రైతుల తరఫున బేరసారాల మండళ్లకు ఆ డైరెక్టర్ అండగా ఉంటారు. పంటలను తెగనమ్ముకోవాల్సిన దుస్థితి నుంచి వారిని కాపాడతారు. భారత్ కూడా ధరల్లో నష్టదాయక అనిశ్చితి నుంచి రైతులను రక్షించడానికి ఇటువంటి చర్యలు తీసుకోవాలి.

వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు రైతులను వదిలేయడం దీర్ఘకాలంలో దేశానికి మంచిది కాదు. ధరల విషయంలో సాగుదారులకు భద్రత కల్పించాలి. వేలాలు, ధరలపై బేరాలు ఎన్ని జరిగినా ఒక రిజర్వు ధరకన్నా తక్కువకు పంటలు అమ్ముకునే అగత్యం రైతులకు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదాహరణకు మామిడి పండ్ల సీజనుకు సమష్టి బేరసారాల మండలి(సీబీసీ) ఒక నిర్దిష్ట ధరను నిర్ణయించాలి. సరఫరాలో తేడాపాడాలను బట్టి ఒక్కసారికి దాన్ని సవరించే వెసులుబాటు కల్పించాలి. చట్టబద్ధమైన సంస్థ ఛత్రంలో రిజర్వు ధరను నిర్ణయించి అమలుపరచాలి. సీబీసీ స్థాపనకు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ చట్టాలు వీలు కల్పిస్తున్నాయి. ఆమోదయోగ్యమైన ధరకు క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఏపీఎంసీ, ప్రైవేటు మార్కెట్లతో పాటు వాటి వెలుపలా, వేలాల్లో ధర విషయంలో కట్టుబాటు ఉండాలి. సీబీసీ ప్రయోజనాలను తోతాపురి రకం మామిడిపై ప్రయోగాత్మకంగా నిరూపించవచ్చు. తోతాపురి నుంచి పండ్ల రసాలు, తాండ్ర తయారుచేస్తారు. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ నుంచి ఈ పండ్లకు గిరాకీ ఎక్కువ. కానీ, వీటి ధరలు విపరీతమైన హెచ్చుతగ్గులకు లోనవుతుంటాయి. దీన్ని అరికట్టడానికి స్థానికంగా చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. ఆ ప్రయత్నాలకు చట్టపరమైన దన్ను లేకపోవడమే కారణం. వ్యవసాయ మార్కెటింగ్ చట్టం ద్వారా ఈ లోపాన్ని సవరించాలి. సదరు చట్టం కింద పండ్ల ధరలను నిర్ణయించాలి. తోతాపురిని పండించే ఇరుగుపొరుగు రాష్ట్రాలను కలుపుకొనివెళ్లాలి. మిగిలిన పంటలకూ ఈ విధానాన్ని వర్తింపజేయాలి. అనేక సమస్యలు ఎదుర్కొంటున్న అన్నదాతలకు చక్కని ధరలు లభించేలా చూడటమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి.-రవిశంకర్ నటరాజన్, వ్యవసాయ ఈ-మార్కెట్ నిపుణులు

జాగ్రత్త కరవై...

ఒక దేశ ఆర్థికాభివృద్ధిలో తయారీ రంగం కీలక పాత్ర పోషిస్తుంది. అయితే, దేశీయంగా పారిశ్రామిక ప్రమాదాలు తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. సరైన ముందు జాగ్రత్తలు కొరవడటం పరిశ్రమల నుంచి తరచూ ప్రమాదకర వాయువులు, రసాయనాలు లీకవుతున్నాయి. వాటి కారణంగా ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్యకు మించి మరెంతో మంది తీవ్ర అనారోగ్యం బారినపడుతున్నారు. గడిచిన కొన్నేళ్లలో ఇండియా వ్యాప్తంగా విష వాయువులు, రసాయనాల లీకేజీ ఘటనలు, మరణాలు...

# ఆప్ - బిజెపి మధ్య 'వాటర్' వార్



న్యూఢిల్లీ,ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5న జరగనున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి ఆమ్ఆద్మీ పార్టీ, బిజెపి, కాంగ్రెస్ పోటీపడుతున్నాయి. ముఖ్యంగా ఆమ్ఆద్మీ పార్టీకి ఈసారి గెలిచే అవకాశం ఇవ్వకూడదని బిజెపి సర్వశక్తులూ ఒడ్డుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ ప్రచారంలో దూకుడు పెంచారు. కేజ్రీవాల్‌పై విమర్శలు గుప్పించారు. అలాగే కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఈసారి తమదే విజయమని ఢంకా కొట్టినట్టు చెబుతున్నారు. మరోవైపు కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా తదితరులు ప్రచారం ముమ్మరంగా సాగిస్తున్నారు. ఈ తరుణంలో యమునా నదిపై రగడ ఆమ్ఆద్మీ, బిజెపి పార్టీల మధ్య వార్‌గా ప్రకంపనలు సృష్టిస్తోంది. యమునానది కాలుష్యం కావడానికి హర్యానా ప్రభుత్వమే కారణమని కేజ్రీవాల్ ఆరోపించడం పెద్ద రాజకీయ దుమారంగా మారింది. తాను బతికి ఉన్నంతవరకు యమునా నది నీటిని ఢిల్లీ ప్రజలు తాగకుండా చేస్తానని కూడా ఆయన ప్రకటించారు. దీనిపై హర్యానా ప్రభుత్వంతోపాటు కేంద్రఎన్నికల కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఇది రెండు వర్గాల మధ్య శత్రుత్వాన్ని రెచ్చగొట్టడమవుతుందని, ఢిల్లీ జల్‌బోర్డు ఉద్యోగులు విషాన్ని ఎలా గుర్తిస్తున్నారో చెప్పాలని ఎన్నికల కమిషనర్ కోరారు. ఈ మేరకు కేజ్రీవాల్‌కు నోటీసులు పంపారు. యమునా నదిలో అమోనియా కలియడంవల్ల విషపూరితం కాకుండా నివారించవలసిన బాధ్యత ఢిల్లీ ఆప్ ప్రభుత్వానిదేనని ఎన్నికల కమిషనర్ గుర్తుచేశారు. మరోవైపు హర్యానా సిఎం నయాబ్‌సింగ్ సైనీ యమునా నదిని తాగడం వైరల్ అయింది. ఆయన నీటిని తాగినట్టు నటించారే తప్ప అసలు తాగలేదని, నోట్లోని నీటిని వెంటనే ఉమ్మేశారని కేజ్రీవాల్ ఆరోపించారు. హర్యానా సిఎం నయాబ్ సింగ్ సైనీ యమునా నీటిని తాగి ఊసేసిన వీడియో క్లిప్‌ను కేజ్రీవాల్ పోస్టు చేశారు. అమోనియో కాలుష్యం కారణంగా యమునా నీరు ఢిల్లీ ప్రజలకు ప్రాణాంతకంగా మారిందన్న తనపై కేసు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని కేజ్రీవాల్ ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రభుత్వాలు, పార్టీలు మంచి నీటి సమస్యను తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఎలా వాడుకుంటున్నారో కొన్ని ఉదంతాలను తెలుసుకుందాం. 2019లో ముంబైలో పైపుల ద్వారా సరఫరా అయ్యే నీళ్లు నూటికి నూరుపాళ్లు సురక్షితమని పాలకవర్గాలు ప్రకటించాయి. కానీ అంతకుముందు వానాకాలం వచ్చేసరికి ముంబై నగరమంతా నీటి సంబంధిత వ్యాధులతో జనం అల్లాడిపోయారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ గత అసెంబ్లీ ఎన్నికల ముందు మంచినీటి సమస్యను పరిష్కరించడమే తమ ప్రాధాన్యంగా ఓటర్లకు హామీఇచ్చారు. తాగునీటి సరఫరా తలసరి వాటా 9 లక్షల లీటర్ల నుంచి 10 లక్షల లీటర్ల వరకు పెంచుతామని హామీ ఇచ్చారు. వాడుక నీటిని రీసైకిల్ చేసి మళ్లీ వినియోగించేలా చేస్తామన్నారు. కానీ చెన్నై సబర్బన్ ప్రాంతం పల్లవరంలో తుపాన్ ప్రభావంతో భారీవర్షాలు కురిసి అక్కడి మంచినీటి వ్యవస్థ దెబ్బతింది. పైపుల ద్వారా వచ్చే కలుషిత నీరు తాగి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో 34 మంది ఆస్పత్రి పాలయ్యారు. ఈ సంఘటనలను పరిశీలిస్తే మంచినీటి సమస్యను ఎన్నికల సమయంలో ప్రచార ఆయుధంగా రాజకీయ పార్టీలు, పాలకులు ఎలా ఉపయోగించుకుంటున్నారో స్పష్టమవతుంది.ఏ పార్టీ అయినా, ప్రభుత్వమైనా, ప్రజల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి, అంకితభావం ఉండాలి. అంతేతప్ప తాగునీటి సమస్యను భూతంలా చూపించి ఓట్లవేట సాగించకూడదు. ఇప్పుడు ఢిల్లీలో జరుగుతున్న యమునా నది రగడ కూడా అంతే. ఎన్నికలు వచ్చేవరకు యమునా నది సమస్య ఆ రాష్ట్ర ప్రభుత్వానికి తెలీదా? వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే కేజ్రీవాల్ యమునా నదిని ప్రక్షాళనం చేస్తామని ఓటర్లకు హామీ ఇచ్చారు. ఆ తరువాత ఈ సమస్యను విస్మరించారు. ఢిల్లీ ఒక్కటే కాదు. దేశం మొత్తం మీద పైపుల ద్వారా వచ్చే నీళ్లు ఎందుకు తాగడానికి పనికి రావడం లేదు? ఎన్ఎస్ఎస్ఒ డేటా ప్రకారం దేశంలో దాదాపు 95 శాతం కుటుంబాలు తాగునీటి సరఫరాకు అనుసంధానంగా ఉంటున్నాయి. పైపుల నీళ్లు, గొట్టపుబావులు, రక్షితబావులు, ప్యాకేజీ నీళ్లు, ఈ విధంగా అందుతున్నాయి. అయితే ఈ విధంగా సరఫరా అవుతున్న నీళ్లన్నీ సురక్షితం అని ఎవరూ నమ్మకంగా చెప్పలేకపోతున్నారు. నీటిసరఫరా చెప్పుకోతగినంతగా మెరుగుపడినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా సరఫరాలో లోటు కనిపిస్తోంది. 2023లో గ్రామీణ కుటుంబాల్లో కేవలం 40% మాత్రమే తమ ప్రధాన నీటి వనరుగా పైపు నీళ్లను వాడుకున్నారు. అదే విధంగా అర్బన్ కుటుంబాలు 70 శాతం పైపు నీళ్లను వినియోగించారు. ప్రపంచస్థాయి నీటి నాణ్యత సూచికలో మొత్తం 122 దేశాల్లో భారత్ 120వ స్థానంలో ఉందని నీతిఆయోగ్ 2018 లో వెలువరించిన తన 'కాంపోజిట్ వాటర్ మేనేజిమెంట్ ఇండెక్స్' లో వెల్లడించింది. దాదాపు 70% నీళ్లు కాలుష్యపూరితంగా ప్రకటించింది. ప్రతి రోజూ నదులు, ఇతర నీటి వనరుల్లో 40 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు కలుస్తున్నాయని అంచనా. చాలా స్వల్పస్థాయిలోనే నీటి ప్రక్షాళన జరుగుతోంది. ఆ నీరు కూడా పైపుల ద్వారా ప్రవహించి చివరకు కలుషితమవుతున్నాయి. దీనికి కారణం పాతపైపులు, మురికినీరు పారే సూయెజ్ లైన్ల అనుసరించి ఈ పైపు నీళ్లు పారుతుండడం కలుషితం కావడానికి దారితీస్తున్నాయి. ప్రతిరోజూ కొన్ని గంటల వరకే పైపుల ద్వారా నీరు సరఫరా అవుతుండగా, పైపులు లీకై చాలావరకు నీళ్లుమట్టిలో కలిసిపోతుండటం పరిపాటిగా జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 1.7 బిలియన్ మంది మలమూత్రాలమయమైన నీటినే తాగునీటిగా వినియోగిస్తున్నారని 2022 లో ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

### జాతుల మధ్య ఘర్షణను రేపేలా సిఎం ఆడియో

న్యూఢిల్లీ,జాతుల మధ్య వైరంతో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ రగిలిపోతోంది. హింసను ప్రేరేపించడం వెనక ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ హస్తం ఉందంటూ ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించి ఆడియోలు కూడా లీక్ అయ్యాయి. ఈ ఆడియో క్లిప్‌కు సంబంధించి ప్రభుత్వ ఫోరెన్సిక్ రిపోర్ట్‌ను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌కు సంబంధించి కొన్ని ఆడియోలు లీక్ అయ్యాయి. దీంతో రాష్ట్రంలో హింసను ప్రేరేపించారని ఆరోపిస్తూ.. కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్టు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై న్యాయస్థానం తాజాగా విచారణ చేపట్టింది. ఆడియో క్లిప్‌లను దేశంలోని స్వతంత్ర ఫోరెన్సిక్ ల్యాబ్ అయిన 'ట్రూత్ ల్యాబ్స్' పరిశీలించిందని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. అందులోని వాయిస్.. సీఎం గొంతుతో 93 శాతం మ్యాచ్ అయినట్లు తేల్చిందన్నారు. వాదనలు విన్న అనంతరం.. ఈ ఆడియోలకు సంబంధించి ఫోరెన్సిక్ రిపోర్ట్‌ను అందించాలంటూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్

# ఏపికి నిధులిచ్చి ఆదుకోవాలి

న్యూఢిల్లీ,ఆర్థికంగా గట్టెక్కించే చర్యలకు సహకరించాలని అరవింద్ పనగడియాను చంద్రబాబు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులే లక్ష్యంగా సీఎం నారా చంద్రబాబునాయుడు సోమవారం 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగడియాతో భేటీ అయ్యారు. ఈ సమావేశం సుమారు రెండు గంటలపాటు జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. తొలుత 45 నిమిషాల అనుకున్న భేటీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల పరిణామాలు, ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై రెండు గంటల పాటు చర్చ జరిగింది. ఏపీ ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల వైసీపీ దుష్పరిపాలన, పలు రంగాల వారీగా జరిగిన నష్టంపై 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం ఏపీ తక్కువ జీడీపీ ఉండటం, దానికి గల కారణాలపై కూడా ప్రజంటేషన్‌లో వివరించారు. ఇటీవల నీతి ఆయోగ్ ఇచ్చిన ఆర్థిక ఆరోగ్య నివేదికలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి గురించి చెప్పిందని, రాష్ట్రం అప్పు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నివేదించిందని చంద్రబాబు గుర్తుచేశారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల పరిణామాలను పనగడియా దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో రంగాల వారీగా జరిగిన నష్టంపై చంద్రబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. 2019-24 మధ్య జరిగిన ఆర్థిక విధ్వంసంపై ఆయన వివరించారు. 'దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీకి తక్కువ జీడీపీ ఉంది. ఐదేళ్ల దుష్పరిపాలన తో రాష్ట్రం చాలా నష్టపోయింది. ఏపీ ఆర్థిక స్థితి దారుణంగా ఉందని.. అప్పులు తిరిగి చెల్లించే స్థితిలో లేదని నీతిఆయోగ్ చెప్పింది. గత ఐదేళ్లలో రూ.10లక్షల కోట్ల అప్పులు తెచ్చారు. రూ.లక్షన్నర కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. 2014-19 మధ్య అభివృద్ధికి, ఆ తర్వాత ఐదేళ్లలో చోటు చేసుకున్న దుష్పరిపాలనతో పొంతన లేకుండా పోయిందని, రాష్ట్రం చాలా నష్ట పోయిందని ప్రజంటేషన్‌లో చంద్రబాబు తెలిపారు. 2019-24 మధ్య జరిగిన ఆర్థిక విధ్వంసంపై ప్రత్యేకంగా ప్రజంటేషన్‌లో సీఎం చంద్రబాబు వివరించారు. దీని కారణంగా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చూపుతున్న ప్రభావం గురించి ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులు తీసుకువచ్చారని, దానికి తోడు మరో రూ. లక్షన్నర కోట్లకు పైగా... పెండింగ్ బిల్లులు పెట్టిపోయారని చంద్రబాబు తెలిపారు. ఈ పరిణామాల నుంచి రాష్ట్రాన్ని ఆర్థికంగా గ్టటెక్కించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా ప్రజంటేషన్‌లో చంద్రబాబు పేర్కొన్నారు. పోర్టులు, లాజిస్టిక్ పార్కులు, పరిశ్రమలు వచ్చేందుకు అనువైన వాతావరణాన్ని ఎలా తయారు చేస్తోంది. పోర్టు ఆధారిత అభివృద్ధికి ఉన్న మార్గాలపై కూడా వివరించి అందుకు సహకరించాలని కోరారు. పోర్టు ఆధారిత, పరిశ్రమల ఆధారిత అభివృద్ధి ఎలా చేయాలన్న దానిపై ఇరువురు నేతలు కీలకంగా చర్చించారు. డీప్ టెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ, ఏఐకు సంబంధించిన విషయాలను ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలపై ప్రజంటేషన్‌లో సవివరంగా సీఎం చంద్రబాబు చెప్పారు. తిరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూనే... అన్ని అంశాల్లో ఆర్థిక సంఘం కూడా తగిన సహకారం ఇవ్వాలని కోరారు. ప్రజంటేషన్ అనంతరం చాలా అంశాలపై చంద్రబాబు, అరవింద్ పనగడియా చర్చించారు. దేశంలో ఆర్థిక వ్యవస్థలను బలోపేతం దిశగా తీసుకువెళ్లడంలో చంద్రబాబు తీసుకున్న చర్యల గురించి అరవింద్ పనగడియా ప్రస్తావించారు. ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏడు రాష్ట్రాలు పోర్టుల ద్వారానే ఎక్కువ ఆదాయం సాధిస్తున్నారని, తెలంగాణ మాత్రమే అందుకు భిన్నంగా ఉందని ఇరువురి మధ్య చర్చించారు. తెలంగాణ కూడా ఎక్కువగా హైదరాబాద్ ఆధారంగానే అభివృద్ధి పథంలో ఉందని, గతంలో చేపట్టిన చర్యలు హైదరాబాద్‌ను ప్రపంచానికి అనుసంధానం చేశాయని పనగడియా పేర్కొన్నారు. బిల్ గేట్స్ హైదరాబాద్ రావడం, దాని కొనసాగింపుగా.. చాలా ప్రపంచ సంస్థలు ఎలా హైదరాబాద్‌కు అనుసంధానం అయ్యాయన్న విషయాను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆర్థిక వ్యవహారాల్లో గుజరాత్, మహారాష్ట్ర మోడల్స్‌తో పాటు సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ప్రయోగంలో హైదరాబాద్ మోడల్ ఎలా విజయవంతం అయిందో ఇరువురి మధ్య చర్చ జరిగింది. వీటితో పాటు 2014-19 మధ్య స్వచ్ఛ భారత్, డిజిటల్ కరెన్సీ వంటి విషయాల్లో చంద్రబాబు ఇచ్చిన నివేదికలు, ప్రస్తుతం వాటి ఫలితాలను చర్చ సందర్భంగా అరవింద్ పనగడియా ప్రస్తావించారు.

# టీడీపీలోకి గలాట..

అమరావతి,తంబళ్లపల్లె నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి జయచంద్రారెడ్డి వర్సెస్ తెలుగు తమ్ముళ్ల మధ్య యుద్ధం తారా స్థాయికి చేరింది. చంద్రబాబుపై రాళ్ల దాడి చేయడంతో పాటు యువ నేత నారా లోకేష్‌పై బూతు పురాణంతో విరుచుకుపడిన వ్యక్తులను పార్టీలోకి చేర్చుకుంటున్న ఇన్చార్జ్‌పై తంబళ్లపల్లె తమ్ముళ్లు రగిలిపోతున్నారంట. రాష్ట వ్యాప్తంగా కూటిమి ప్రభంజనం వీడినప్పటికీ తంబళ్లపల్లెలో టీడీపీ ఓటమికి పెద్దిరెడ్డి కుటుంబంతో జయచంద్రారెడ్డి చేసుకున్న లోపాయికారీ ఒప్పందమే కారణమని పార్టీ శ్రేణులు విమర్శిస్తున్నాయి. అయితే పార్టీ ఇన్చార్జ్ మాత్రం తనను సొంత వారే వెన్నుపోటు పొడిచారని ఆరోపిస్తున్నారు. ఎవరి వాదనలు ఎలా ఉన్నా ప్రస్తుతం అక్కడ పార్టీకి పెద్ద దిక్కులేకుండా పోయాడంటున్నారు.చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీలో వర్గ విబేధాలు తారాస్థాయికి చేరాయి. తంబళ్లపల్లె నియోజవర్గం తెలుగుదేశం ఆవిర్భావం నుంచి టీడీపీకి బలమైన నియోజకవర్గాల్లో ఒకటిగా ఉండేది. కాని ప్రస్తుతం సరైన నాయకుడు లేని పరిస్థితి ఎదుర్కొంటోంది. 2009లో లక్ష్మీ దేవి కూమారుడు ప్రవీణ్ కూమార్‌రెడ్డి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా ఎంపికయ్యారు. అయితే మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డితో పాటు ప్రవీణ్ కూడా వైసీపీలో చేరిపోయారు. 2014లో వైసీపీ తరపున పోటీచేసిన ప్రవీణ్ ను అప్పుడే టిడిపిలో చేరిన శంకర్ యాదవ్ ఓడించారు.సరిగ్గా అప్పుడే మాజీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చూపు తంబళ్లపల్లెపై కూడా పడింది. 2019లో శంకర్ యాదవ్ పై వైసిపి అభ్యర్థిగా పెద్దిరెడ్డి తమ్ముడు ద్వారకానాథ్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిచారు. అ ఎన్నికల్లో ఓటమి తర్వాత తంబళ్లపల్లెలో టీడీపీ పరిస్థితి దారుణంగా మారిపోయింది. పెద్దిరెడ్డి పెత్తనానికి దడిచి జిల్లా అగ్ర నాయకులు కనీసం అటు వైపు దృష్టి సారించలేదంటారు. గత ఎన్నికల ముందు అభ్యర్థి విషయంలో చివరి దాకా అగినా.. అధిష్టానం చివరికి మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ కాదని జయచంద్రారెడ్డికి టికెట్ ఇచ్చింది.జయచంద్రారెడ్డి అభ్యర్థిత్వాన్ని శంకర్ వర్గం వ్యతిరేకించింది. ఎన్నికల్లో జయచంద్రరెడ్డి రెడ్డి ఓడిపోయారు. అంతకు ముందు ఎన్నికల్లో సాధించిన మెజార్టీలో నాలుగో వంతు మెజార్టీ సాధించిన పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి రెండో సారి ఎమ్మెల్యే అయ్యారు. అప్పటి నుంచిజయచంద్రరెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు శంకర్ అనుచరులకు ఇప్పుడు లోకల్ టీడీపీ కేడర్ కూడా తోడైంది.ఈ మధ్య రెండు వర్గాల మధ్య అధిపత్యపోరు పిక్స్ చేరిందంటున్నారు. ముఖ్యంగా జయచంద్రారెడ్డి తీరును అసలు తమ్ముళ్లు తట్టుకోలేక పోతున్నారంట. 2019 ఎన్నికల్లో దాదాపు 47 వేల ఆధిక్యతతో గెలిచిన పెద్దిరెడ్డి తమ్ముడు గత ఎన్నికల్లో పది వేల మెజార్టీతో గట్టెక్కారు. దానికి పెద్దిరెడ్డి ఫ్యామిలీతో జయచంద్రారెడ్డి చేసుకున్న లోపాయికారీ ఒప్పందమే కారణమన్న ఆరోపణలున్నాయి. దానికి తగ్గట్లే ఎన్నికల తరువాత పెద్దిరెడ్డి అనుచరులను ఆయన పార్టీలో చేర్చుకోవడం మొదలెట్టారు. తంబళ్లపల్లెలో చంద్రబాబుపై రాళ్ళ దాడి చేసివారికి సైతం టీడీపీలో చేర్చుకుని ప్రాధాన్యత ఇస్తున్నారని తెలుగు తమ్ముళ్లు ఆరోపిస్తున్నారు.

# చైనా డీప్‌సీక్ దూకుడుకు చెక్ పెట్టే యత్నం

వాషింగ్టన్,కృత్రిమ మేధ రంగంలో పెను సంచలనం సృష్టించిన చైనా 'డీప్‌సీక్'.. దిగ్గజ ఏఐ సంస్థలకు సవాళ్లు విసురుతోంది. ఈనేపథ్యంలోనే అమెరికా టెక్ సంస్థ 'ఓపెన్ ఏఐ ' కీలక ప్రకటన చేసింది. 'డీప్ రీసెర్చ్ ' పేరుతో కొత్త టూల్‌ను ఆవిష్కరించింది. మనిషి చాలా గంటల్లో చేసే పనిని ఈ కొత్త టూల్ పది నిమిషాల్లోనే చేసి పెడుతుందని కంపెనీ వెల్లడించింది. 'ఓపెన్ ఏఐ తదుపరి ఏజెంట్ డీప్ రీసెర్చ్ స్వతంత్రంగా పని చేయగలదు. మీరు ప్రాంప్ట్ ఇస్తే.. చాట్‌జీపీటీనే వందలాది ఆన్‌లైన్ సోర్సులను విశ్లేషించి.. రీసెర్చ్ అనలిస్ట్ స్థాయిలో సమగ్ర నివేదిక రూపొందిస్తుంది' అని కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడించింది. టోక్యోలో ఉన్నతస్థాయి సమావేశానికి ముందు కంపెనీ ఈ టూల్‌ను ఆవిష్కరించింది.ఓపెన్‌ఏఐ చీఫ్ శామ్ ఆల్ట్‌మన్ ప్రస్తుతం టోక్యోలో ఉన్నారు. జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా, టెక్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ గ్రూప్ అధినేత మసయోషి సన్‌తో ఆయన చర్చలు జరపనున్నారు. ఓపెన్‌ఏఐ, సాఫ్ట్‌బ్యాంక్, ఒరాకిల్ కలిసి 'స్టార్‌గేట్' పేరుతో సంయుక్త ప్రాజెక్టును ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ సంస్థ కృత్రిమ మేధలో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనుందని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇదిలాఉండగా.. చైనా కు చెందిన 'డీప్‌సీక్ ' ఇటీవల అమెరికా టెక్ స్టాక్స్‌ను కుదిపేసిన సంగతి తెలిసిందే. హాంగ్జౌకు చెందిన ఈ ఏఐ రీసెర్చ్ సంస్థ.. కొన్ని రోజుల కిందట ఆర్1 పేరిట ఏఐ మోడల్‌ను ఆవిష్కరించింది. ఇది పూర్తిగా ఉచితం. ఓపెన్‌ఏఐ, క్లాడ్ సోనెట్ వంటి సంస్థలు ఇందుకోసం సబ్‌స్క్రిప్షన్ రూపంలో కొంత మొత్తాన్ని వసూలుచేస్తున్నాయి. ఈనేపథ్యంలో పూర్తి అడ్వాన్స్ ఏఐ మోడల్‌ను ఇలా పూర్తిగా ఉచితంగా అందిస్తుండడంతో డీప్‌సీక్ పేరు నెట్టింట మార్మోగింది. అంతేకాదు.. టెస్ట్ ఏఐ మోడళ్ల తయారీ కోసం ఓపెన్‌ఏఐ, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు బిలియన్ల కొద్దీ డాలర్లు వెచ్చిస్తున్న వేళ.. డీప్‌సీక్ మాత్రం కేవలం 6 మిలియన్ డాలర్లతో లేటెస్ట్ ఏఐ మోడల్‌ను రూపొందించడం గమనార్హం.

# పెద్దగట్టులో జాతర సందడి

సూర్యాపేట, రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జాతర అయిన సూర్యాపేట జిల్లాలోని శ్రీ లింగమంతులస్వామి (గొల్లగట్టు) దేవరపెట్టెను కేసారం నుండి ఆదివారం రాత్రి దురాజ్‌పల్లి ఆలయానికి తరలించారు. ఆదివారం సాయంత్రం కేసారం గ్రామంలో మెంతబోయిన, మున్న వంశస్థులు, బైకానులు దేవరపె÷–టటెలోని దేవతామూర్తులైన లింగమంతులస్వామి, గంగమ్మ, ఆకుమంచమ్మ, యలమంచమ్మ, చౌడమ్మల బొమ్మలను గుడ్డలతో తుడిచి పలుసు, కుంకుమతో బొట్టు పెట్టి బంతి పూలదండలతో అలంకరించారు. కుల పెద్దలు దూప, దీపారాధన చేసి కొబ్బరికాయలు కొట్టి పరమాన్నం నైవేద్యంగా పెట్టి, మొక్కి దేవరపె÷–టటెను ఓ లింగా?ఓ లింగా అంటూ కదిలించారు. ఆదివారం రాత్రి కేసారం గ్రామం నుండి ప్రారంభమైన దేవరపెటటె తరలింపు అర్ధరాత్రి వరకు దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి ఆలయానికి చేరుకుంది. దేవరపె÷–టటెను శనివారం మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలం, చీకటాయపాలెం గ్రామం నుండి ఊరేగింపుగా కేసారానికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ పోలెబోయిన నరసయ్య యాదవ్, డైరెక్టర్లు మెంతబోయిన లింగస్వామి, మెంతబోయిన మల్లయ్య, కుల పెద్దలు మెంతబోయిన పెద్ద నాగయ్య, మెంతబోయిన వెంకన్న, మెంతబోయిన బుచ్చయ్య, మెంతబోయిన సందయ్య, మెంతబోయిన గంగయ్య, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# లెక్క చేయని కేడర్...

హైదరాబాద్,మాటల మాంత్రికుడు కేసీఆర్ మళ్లీ యాక్టివ్ అవుతానంటున్నారు. పబ్లిక్ మీటింగ్ పెట్టి మరీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానంటున్నారు. మనం కొడితే మామూలుగా ఉండదని సినీ డైలాగులు చెప్పి ఫాంహౌస్‌కి వచ్చిన కేడర్తో తెగ చప్పట్లు కొట్టించుకుంటున్నారు. అయితే ఎన్నికల్లో ఓటమి తర్వాత మాజీ ముఖ్యమంత్రి ప్రజాక్షేత్రంలో కనిపించడం మానేశారు. అప్పుడప్పుడు ఆయన మాట్లాడిన వీడియోలను పార్టీ నేతలు విడుదల చేయడమే గాని.. బడ్జెట్ సమావేశాల రోజున తప్ప కేసీఆర్ బయటకొచ్చింది లేదు. అట్లాంటిదిప్పుడు నెలాఖరులో బహిరంగ సభ అంటున్నారు. ఆయన ఫాంహౌస్ స్టేట్‌మెంట్‌పై గులాబీ శ్రేణుల్లోనే నమ్మకం కనిపించడం లేదంట. ఈ సారైనా సార్ మాట నిలబెట్టుకుంటారా అని పార్టీ కేడర్ తెగ చర్చించుకుంటుందంట.మన కొడితే దెబ్బ ఎంతగట్టిగా ఉంటుందో అధికార పార్టీకి చూపిద్దాం..ఇదీ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేపదే ఇచ్చే స్టేట్‌మెంట్. ఎన్నికల్లో ఓటమి తరువాత ఆయన పెద్దగా బయటకు వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించిన దాఖలాలు లేవు. బడ్జెట్ సమావేశం రోజున మినహాయించి కనీసం అసెంబ్లీకి కూడా రాకపోవటంతో గత ఏడాది కాలంగా బీఆర్ఎస్ నేతలు సైతం కేసీఆర్ తీరుపట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రజల్లో తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నప్పటికీ.. కేసీఆర్ మాత్రం ఫాంహౌస్‌కే పరిమితమవుతున్నారు.పార్టీ శ్రేణులు ఫాంహౌస్‌కి వెళ్లి కలిసినప్పుడు మాత్రం ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం.. ఇక వస్తున్నా కాసుకోండి అంటూ హెచ్చరించడం.. ఆయన మాట్లాడే వీడియోను సదరు నేతలు సోషల్ మీడియాలో విడుదల చేయడం.. ఏడాదికాలంగా పరిపాటై పోయింది. కేసీఆర్ మాత్రం బయటకు వచ్చింది లేదు. తాజాగా.. మరోసారి కేసీఆర్ ఫాంహౌస్ నుంచి డైలాగ్ వీడియో రిలీజ్ అయింది. ఫిబ్రవరి చివరిలో పెద్ద సభ పెడదాం.. కాంగ్రెస్ పాలనను గమనిస్తున్నా.. నేను దెబ్బ కొడితే గట్టిగానే కొడతా అంటూ బీఆర్ఎస్ శ్రేణుల్లో కేసీఆర్ ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. ఈ నెలాఖరులో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తామని సెలవిచ్చారు.కేసీఆర్ వ్యాఖ్యలతో బీఆర్ఎస్ నేతలు సంతోషపడుతున్నప్పటికీ.. అదే సమయంలో వారిలో అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయంట. ఏడాది కాలంగా ఇలాంటి విమర్శలే చేస్తూ ప్రజాక్షేత్రానికి దూరమైన కేసీఆర్ ఈ సారైనా ఆయన చెప్పిన విధంగా ఫిబ్రవరి చివరిలో బయటకు వచ్చి బహిరంగ సభలో ప్రసంగిస్తారా అన్న అనుమానం వేధిస్తుందంట. సొంత పార్టీ వారే ఆయనపై అంత అనుమాన పడుతుంటే.. మరోవైపు అధికారపక్షం నుంచి కేసీఆర్ వ్యాఖ్యలపై గట్టి రిటార్ట్‌లే పడుతున్నాయి.కొడితే తాను మామూలుగా కొట్టనన్న KCR వ్యాఖ్యలకు %జవీ% రేవంత్ కౌంటర్ ఇచ్చారు. గట్టిగా కొట్టడం సంగతి అటుంచితే.. ముందు సరిగ్గా నిలబడటం నేర్చుకోమని సీఎం రేవంత్ సలహా ఇచ్చారు. ట్విట్టర్లో లైకులు ఎక్కువగా వచ్చాయని KCR చెప్పుకుంటున్నారని, దీన్ని బట్టి ఆయన మానసిక స్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు సీఎం రేవంత్ రెడ్డి.అదలా ఉంటే కేసీఆర్ తాజా వ్యాఖ్యలను బీఆర్ఎస్ శ్రేణులే విశ్వసించడం లేదంట. ఇదిగో వస్తున్నా.. అదిగో వస్తున్నా అంటూ గత ఏడాది కాలంగా ఫామ్ హౌస్‌లో నుంచి ప్రకటనలు గుప్పించి కేడర్‌లో ఉత్సాహాన్ని నింపడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలు.. అంతిమంగా పార్టీ క్యాడర్ ను ఇబ్బందుల్లోకి నెట్టడానికి తప్ప మరెందుకూ పనికిరావడం లేదని పార్టీ శ్రేణులు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నాయి. మరోవైపు.. కేటీఆర్, హరీశ్ రావులు నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ నేతలకు అండగా ఉన్నామని భరోసా ఇస్తున్నారు.

# ప్రపంచ పాలకులకు సోకుతున్న అంటువ్యాధి నియంత బుద్ధి!



జి జిన్ పింగ్ తనను తాను చైనాకు మరణించేవరకు ప్రెసిడెంట్ గా 2018 లోప్రకటించుకున్నాడు. 72 ఏళ్ల వ్లాదిమిర్ పుతిన్ తనను తాను 2036 వరకు, అనగా ఆయనకు సుమారు 84 ఏళ్ల వయసు వచ్చేవరకు, రష్యాకు అధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడు. ఉత్తరకొరియా కిమ్ జోంగ్ సంగతి చెప్పక్కర్లేదు. అక్కడ ఎన్నికలు జరిగినా జరక్కపోయినా ఒక్కటే. మరణించే దాకా తామే రాజ్యాం చేయాలని, అధికారం వెలగబెట్టాలని ప్రకటించుకున్న ఆ ఇద్దరు నేతలు అందుకు అనుగుణంగా ఆ దేశ రాజ్యాంగాన్నే సవరించేశారు. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ వంతు వచ్చింది. అగ్రరాజ్యం అమెరికా పీఠం మీదకు రాగానే.. ఆయనకు ఈ అంటు వ్యాధి సోకింది. రాజ్యాంగసవరణ దిశగా ఆలోచనలు సాగిస్తున్నారు. నియంతలాగా స్థిరపడాలని అనుకుంటున్నారు.నెమ్మది నెమ్మదిగా ప్రపంచంలోని పాలకులందరూ కూడా ఇలాంటి ఆలోచన దిశగా అడుగులు వేస్తున్నారా? అనే భయం కలుగుతోంది. ఆల్రెడీ నియంతృత్వమే విధానంగా బతుకుతున్న దేశాల సంగతి వేరు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లిన దేశాలు కూడా.. ఇప్పుడు భిన్నంగా మారుతున్నాయి. చూడబోతే.. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన భారత్ లోనే కాస్త భద్రమైన పరిస్థితి కనిపిస్తోంది. నిజమేనా? మనదేశంలో ప్రజాస్వామ్యం భద్రంగా ఉందా? ప్రమాదం లేదా? ప్రపంచ పాలకుల పోకడలతో పోల్చుకుంటూ సాధికార విశ్లేషణే ఈ వారం గ్రేట్ ఆంధ్ర కవర్ స్టోరీ.. "ప్రపంచ పాలకులకు సోకుతున్న అంటువ్యాధి.. నియంత బుద్ధి!"జొహాన్ వోల్ఫ్‌గ్యాంగ్ వోన్ గోతె 17వ శతాబ్దకాలం నాటి ఒక జర్మన్ రచయిత. ఆయన 1774లో ది సారోస్ ఆఫ్ యంగ్ వెర్దర్ అనే నవల రాశారు. ఆ నవలలో వెర్దర్ కథానాయకుడు. ఆ నవలలో వెర్దర్ ఆత్మహత్య చేసుకుని మరణిస్తాడు. ఆ సంగతి బహిరంగం అవుతుంది. దాని వెంబడి అనేక మంది అతడి ఆత్మహత్యను అనుకరిస్తూ.. తాము కూడా ఆత్మహత్యలు చేసుకుని మరణిస్తారు.ఆత్మహత్యకు సంబంధించి పత్రికలలో ఒక కథనం ప్రచురితం అయిన తర్వాత.. అదే తరహా ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతుండడాన్ని సాధారణంగా కాపీ క్యాట్ ఆత్మహత్యలు అని వ్యవహరిస్తుంటారు. అమెరికాలో ఇలాంటి వరుస ఆత్మహత్యలు జరుగుతున్న నేపథ్యంలో 1974లో మొదటిసారిగా ఫిలిప్స్ అనే మానసిక శాస్త్రవేత్త మొదటి సారిగా గోతె నవలలోని పాత్రను దృష్టిలో ఉంచుకుని వెర్దర్ ఎఫెక్ట్ అనే పదం ఈ ఆత్మహత్యలకు వాడారు. సైకాలజీలో వీటిని ఆ పేరుతో వ్యవహరిస్తారు. అంటే ఆత్మహత్యలు కూడా ఒక అంటు వ్యాధిలాగా ప్రబలుతాయన్నమాట. సైకాలజీ వీటిని సూసైడ్ కంటాజియన్ అని కూడా వ్యవహరిస్తారు.ఈ సైకాలజీ శాస్త్రీయమైన పరిభాష ఏదీ మనకు తెలియకపోవచ్చు గానీ.. ఇలాంటి ఆత్మహత్యలు మాత్రం మనకు మన చుట్టూ ఉన్న సమాజంలో పుష్కలంగా, పుంఖాను పుంఖాలుగా కనిపిస్తుంటాయి. 'అప్పుల బాధతో రైతు ఆత్మహత్య' అనే వార్త పత్రికల్లో ప్రముఖంగా వస్తుంది. దాని వెంబడి అనేక మంది రైతులు వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్యలు చేసుకోవడం చాలా సాధారణంగా జరిగిపోతుంది. అత్తింటి ఆరళ్లు తాళలేక నవవధువు ఆత్మహత్య, ఇద్దరు పిల్లల సహా తల్లి ఆత్మహత్య.. ప్రత్యేకించి.. ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మహత్య ఇవన్నీ ఈ కోవకే చెందుతాయి. ఆత్మహత్యలు కూడా అంటువ్యాధిలాగా వ్యాపిస్తాయి.సూటిగా చెప్పాలంటే.. 'వెర్దర్ ఎఫెక్ట్' అనే పదం కేవలం ఆత్మహత్యల నేపథ్యంలో పుట్టి ఉండవచ్చు. కానీ.. ఒక వ్యవహారానికి సంబంధించి.. ఒకరి పోకడ బహుళ ప్రచారంలోకి వచ్చిన తర్వాత.. ఇంకా అనేక మంది అదే పోకడను అనుసరించే మోజులో ఉంటే వాటన్నింటినీ కూడా మనం వెర్దర్ ఎఫెక్ట్.. కాపీ క్యాట్ సిండ్రోమ్ అనే అనవచ్చు. ఇప్పుడు ప్రపంచంలో అనేక దేశాల పాలకులను అంటువ్యాధిలాగా ఆవరిస్తోన్న సిండ్రోమ్ ఇది.పాలకుడిగా అవకాశం చిక్కిన వెంటనే అందరిలోనూ తాము శాశ్వతంగా అధికార పీఠం మీదనే ఉండిపోవాలనే 'నియంత బుద్ధి' పొడసూపుతోంది. తమకు శాశ్వతాధికారం దక్కడం కోసం ఏమేం చేయవచ్చునో వారు రకరకాల మార్గాలను అన్వేషిస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు.. ఇదే తరహా పోకడలతో చెలరేగిపోతున్నారు. తాజాగా.. అమెరికా అధ్యక్షుడిగా పగ్గాలు స్వీకరించిన వెంటనే.. అమెరికా రాజ్యాంగంలో మార్పుచేర్పులు చేసి అయినా సరే.. తనకు శాశ్వతాధికారం దక్కించుకోవాలని అనుకుంటున్న ట్రంప్ వైఖరి.. మనకు ఇలాంటి అభిప్రాయం కలిగిస్తోంది.

డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు రెండోసారి అమెరికా అధ్యక్షుడు అయ్యారు. అమెరికాలో ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా పోటీచేయకూడదనేది చట్టంలో ఉంది. ఈ చట్టసవరణ 1947లో జరిగింది. అదివరలో అది కేవలం సాంప్రదాయంగా మాత్రమే ఉండేది. ఫ్రాంక్లిన్ డి.రూజ్ వెల్ట్ 1933 నుంచి 1945లో మరణించే వరకు వరుసగా నాలుగుసార్లు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అమెరికా అధ్యక్షుడు రెండు పర్యాయాలు మాత్రమే ఆ పదవిలో ఉండాలనే సాంప్రదాయాన్ని, చట్టబద్ధమైన నిబంధనగా మార్చాలనే ప్రయత్నం ఆయన మరణానంతరమే జరిగింది. 1947 లో ఆమేరకు రాజ్యాంగ సవరణ చేశారు. అప్పటినుంచి ఇప్పటిదాకా అందరూ దానినే అనుసరిస్తున్నారు.ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ కు కొత్త ఆలోచన వచ్చింది. ఇప్పుడు బాధ్యతలు తీసుకున్న 79 ఏళ్ల ట్రంప్ పదవీకాలం 2029లో ముగుస్తుంది. అప్పటికి ఆయనకు 83 ఏళ్ల వయసుంటుంది. అప్పుడు తాను మూడోసారి కూడా అమెరికా అధ్యక్షుడు అయ్యేందుకు వీలుగా, అవసరమైన రాజ్యాంగ సవరణ ప్రక్రియ చేపట్టాలనే ఆలోచనను ఆయన ప్రకటించారు. ఊహాజనితమే అయినప్పటికీ.. ఒకవేళ అలాంటి చట్టసవరణ జరిగి, ఆ మూడోసారి పోటీచేసిన ఎన్నికల్లో ఆయన నెగ్గితే.. 87 ఏళ్ల వయసు వరకు అధ్యక్షుడగానే ఉంటారు. లేదా ఆ రాజ్యాంగ సవరణ అనేది ఇంకా ఏ రూపంలో చేస్తారో తెలియదు గనుక.. ఆ తర్వాత కూడా తానే అధ్యక్షుడు కాదలచినా ఆశ్చర్యం లేదు. స్థూలంగా గమనించినప్పుడు.. అమెరికా అధ్యక్షపీఠంపై మరణించే వరకు తానే ఉండిపోవాలని ట్రంప్ కోరుకుంటున్నారని ఎవరికైనా అర్థమవుతుంది. ఇది ప్రజాస్వామిక లక్షణం కాదు. రాజరికపు, నియంత బుద్ధుల పోకడ!డొనాల్డ్ ట్రంప్ కు ఈ ఆలోచన హఠాత్తుగా తనకు తానుగా తన బుర్రలో పుట్టినదేనని అనుకోవడానికి వీల్లేదు. మనం ముందే చెప్పుకున్న వెర్దర్ ఎఫెక్ట్ ద్వారా ట్రంప్ కు సోకిన అంటు వ్యాధి ఇది. ప్రపంచంలోనే అగ్రరాజ్యపు అధిపతికి.. నియంత బుద్ధుల అంటువ్యాది సోకింది. ఇతరత్రా అనేక విధాలుగా కూడా ఆయన దానిని ప్రదర్శిస్తూనే ఉన్నారు. అదే సమయంలో.. అది ఆయనకు ఎక్కడినుంచి వచ్చింది అనే సంగతిని కూడా గమనించాలి.ప్రపంచంలో నియంతృత్వంమే తమ విధానంగా గల దేశాలు అనేకం ఉన్నాయి. ఆ దేశాల నియంత పాలకులు తమ ఇష్టానుసారం దేశాన్ని నడిపిస్తున్న తీరును కూడా మనం గమనిస్తూనే ఉంటాం. ఆయా దేశఆలు ఎంతటి దుర్బల స్థితిలో కునారిల్లుతున్నాయో కూడా చూస్తుంటాం. విధానమే నియంతృత్వం అయిన వారి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాల్సిన అవసరం లేదు. కానీ ప్రజాస్వామ్యపు ముసుగులో.. ప్రజలు ఎన్నుకున్న ప్రజారక్షకుల ముసుగులో.. నియంతలా పాలించాలని అనుకోవడమే ఆలోచన పరులను ఇబ్బంది పెడుతుంది. ప్రపంచ యవనికపై అనేకమంది పాలకులు ఒకసారి పాలన అవకాశం దొరికిన తర్వాత.. ఈ బుద్ధిని ప్రదర్శిస్తున్నారు.ఇటీవలి కాలంలో చైనా అధ్యక్షుడు జి జిన్ పింగ్ తన మరణం వరకు తానే అధ్యక్షుడిగా ఉండేలా ప్రకటించుకున్నారు. ఆమేరకు చట్టసవరణ చేసుకున్నారు. ఆ తర్వాత రెండేళ్లకు వెర్దర్ ఎఫెక్ట్ ప్రకారం ఆ అంటువ్యాధి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కు సోకింది. ఆయన 2036 దాకా అధ్యక్షస్థానంలో తానే ఉండేలా రాజ్యాంగాన్ని సవరించేసుకున్నారు. అప్పటికి ఆయనకు 83 ఏళ్లు వస్తాయి. ఆతర్వాతి సంగతి గురించి.. అప్పటికప్పుడు మళ్లీ రాజ్యాంగాన్ని సవరించుకుంటారేమో తెలియదు. ఇలా ప్రపంచంలో చైనా, రష్యా వంటి రెండు పెద్ద దేశాల పాలకులు స్థిరీకరించుకుంటున్న నియంతబుద్ధులు అంటువ్యాధిలా అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు కూడా ఇప్పుడు సోకినట్టుంది.నియంతబుద్ధుల్లో కూడా ఆయన ఎంతో ఔదార్యంతో మూడోదఫా పోటీకి వీలుగా సవరణ జరగాలని మాత్రమే అంటున్నారు. ఇప్పుడు 78 ఏళ్ల ఈ కుర్రవాడు, అన్నీ అనుకూలిస్తే, చట్టసవరణ చేయగలిగితే.. అప్పటికి 82 ఏళ్ల వయసులో మళ్లీ పీఠం ఎక్కాలనుకుంటున్నాడు. పుతిన్ 83లో వయసు నాటికి ముగించేలా సవరణ చేసుకుంటే.. ట్రంప్ 82లో మళ్లీ మొదలయ్యేలా సవరణ ఆశిస్తున్నారు. ఇంకా నయం అధ్యక్షపీఠంపై తాను శాశ్వతంగా ఉండిపోతాననే తరహాలో చట్టసవరణకు ప్రయత్నించడం లేదు. ఆ మాత్రం ఉదారవాదానికి ఆయనకు ఆ దేశ ప్రజలు రుణపడి ఉండాలి.

### మనదేశంలో సంగతేంటి..?

నియంతబుద్ధులు అనేవి ఇలాంటి చట్ట సవరణలు జరిగినప్పుడు మాత్రమే బయటకు వస్తాయిన అనుకుంటే పొరబాటు! ఈ నియంతబుద్ధుల ప్రస్తావనలన్నీ మిగిలిన ప్రపంచపు దుర్మార్గాలు కదా.. ఆ ప్రపంచం ఎలా పోతే మనకేంటి? మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ప్రజాస్వామ్యం మాత్రమే పరిఢవిల్లుతున్నది.. పరిఢవిల్లుతూ ఉంటుంది.. అని మనం అనుకుంటే అది భ్రమే. సాంకేతికంగా మనది ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం అనే మాట మాత్రమే నిజం. కానీ ప్రపంచంలో ఇంతగా కుటుంబ, వారసత్వ రాజకీయాలకు నెలవైన దేశం మరొకటి ఉండకపోవచ్చు.ముందు మన తెలుగు రాష్ట్రాల సంగతి చూద్దాం. వైఎస్ రాజశేఖర రెడ్డికి వారసుడిగా జగన్మోహన్ రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. తొలిప్రయత్నంలో ఆయనను ప్రజలు తిరస్కరించినప్పటికీ.. మలి ప్రయత్నంలో ముఖ్యమంత్రిగా అవకాశం కట్టబెట్టారు. జగన్ నిజంగానే విప్లవాత్మకమైన, దేశం మొత్తం అనుసరించి తీరవలసిన కొన్ని సరికొత్త సంక్షేమ ఆలోచనలకు తన పదవీకాలంలో శ్రీకారం చుట్టారు. ఆ సంక్షేమ పథకాల అంతిమ లబ్ధిదారులు వాటిని అందించిన పాలకుడిని ఎప్పటికీ అభిమానించే, ప్రేమించే వాతావరణాన్ని కల్పించారు. అయితే పరిపాలనకు అదొక్కటే సరిపోదు అనే సంగతిని విస్మరించారు. ప్రజలు అభిమానాన్ని పొందడానికి మించి, ప్రభుత్వాధినేతగా చేయవలసిన పనులతో సమతుల్యత సాధించడంలో విఫలం అయ్యారు. మరో ముప్పయ్యేళ్లపాటు నిరంతరాయంగా తానే ముఖ్యమంత్రిగా ఉండాలని మాత్రం కోరుకున్నారు. ఎంచిచూస్తే ఆయన కలగన్న గడువు నాటికి ఆయనకు కూడా 82 ఏళ్లు నిండుతాయి.రాజ్యాంగాన్ని సవరించలేడు గనుక సరిపోయింది గానీ, జగన్ ఆలోచన కూడా పుతిన్ లాగానే అదే వయోపరిమితికి సాగింది! ప్రభుత్వాధినేతగా నియంతగా సాగే చాన్స్ ఎటూ లేదు గనుక.. ఆయన తాను స్థాపించుకున్న తన సొంత పార్టీకి తనను శాశ్వత అధ్యక్షుడిగా చేసుకున్నాడు. కానీ.. ఎన్నికల సంఘం ఈ దేశంలో అలాంటివి చెల్లవని తేల్చి చెప్పడంతో.. మళ్లీ వెనక్కు తగ్గారు. స్పష్టంగా చెప్పాలంటే జగన్ కాస్త అత్యుత్సాహంతో తనలోని నియంత బుద్ధులను బయటపడి ప్రదర్శించేసుకున్నారు. కానీ, ఈ దేశంలో 80 శాతం పార్టీలు నడుస్తున్నది అలాంటి నియంతబుద్ధుల నాయకుల చేతుల్లోనే..!చట్టబద్ధ అధికారంలో ఉండేలా చేసుకోవడం మాత్రమే నియంత బుద్ధి కాదు. పార్టీ మీద పెత్తనాన్ని కూడా శాశ్వతంగా తామే కలిగి ఉండాలని అనుకోవడం కూడా నియంత బుద్ధే. కుటుంబ రాజకీయాలనే పదం వినిపిస్తే మొట్టమొదటగా మనకు గుర్తు వచ్చేది కాంగ్రెస్ పార్టీ. తాము చాలా ప్రజాస్వామికంగా ఉంటున్నాం అని చెప్పుకోవడానికి ఆ పార్టీ అధ్యక్షులను ఇతర వర్గాలనుంచి 'ఎన్నుకుంటూ' ప్రస్థానం సాగిస్తోంది.కానీ పెత్తనం మొత్తం ఒకే కుటుంబం చేతిలో ఉందనేది అందరికీ తెలుసు. ప్రాంతీయ పార్టీల సంగతి ఇక చెప్పాల్సిన అవసరమే లేదు. అంతో ఇంతో దక్షిణ భారతదేశంలో ఎంతో విప్లవాత్మకమైన భావజాలాలనుంచి పుట్టినవి ద్రవిడ పార్టీలు. అలాంటివాటిలో ఒకటైన డీఎంకే పార్టీని కూడా కరుణానిధి.. హేయంగా ఒక కుటుంబ పార్టీలాగా మార్చేశారు. కరుణ తరువాత స్టాలిన్, ఆ తరువాత ఉదయనిధి.. ఇలా! అధికారం ఎప్పటికీ, అది పార్టీ మీదనే కావొచ్చు గాక, మా చేతిలోనే ఉండాలి.. అనే భావనే నియంత బుద్ధి గా మనం గుర్తించాలి. చంద్రబాబు–లోకేష్, కేసీఆర్–కేటీఆర్ తెలుగు నాట ఈ కాంబినేషన్లు అన్నీ ఇలాంటివే.ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో సైతం అనేక ప్రాంతీయ పార్టీలు ఇదే సంకుచిత ధోరణులతో అలరారుతున్నవే. తనకంటూ కుటుంబం కూడా లేని.. ఎంతో ఉదారవాద నాయకురాలిగా, ఆవేశ పూరితురాలైన మంచి నాయకురాలిగా కనిపించే పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కూడా వారసుడిగా మేనల్లుడిని రంగంలోకి తీసుకువచ్చారు. 'అయితే నేను%–% లేకపోతే నా కుటుంబం' అనే ధోరణి లేకుండా ఇప్పటికి మనకు కనిపిస్తున్న నాయకులు ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ వంటి అతి కొద్ది మంది మాత్రమే. బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఈ వర్గానికి చెందవలసిన వారే గానీ.. ఆయన ఎప్పటికీ తాను మాత్రమే సీఎంగా ఉండాలనే కాంక్షతో ఒక సిద్ధాంతమూ, నియమమూ ఏదీ లేకుండా అవకాశవాదంతో కుదుర్చుకునే పొత్తులు.. ఆ క్రెడిట్ దక్కకుండా చేసేస్తాయి.కేంద్రంలో భారతీయ జనతా పార్టీ పాలకుల పరిస్థితి చిత్రమైనది. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, విలువలు, ఆదర్శాలకు విలువ ఇచ్చే పార్టీ ఇలాంటి నిర్వచనాలన్నీ నరేంద్ర మోడీ అనే సుడిగాలి ఉధృతికి చెల్లాచెదరు అయిపోయాయి. ఆపార్టీలో ఒకప్పుడు ఎలాంటి నియమాలు, సిద్ధాంతాలు ఉన్నాయో ఇప్పుడు ఎవరికీ గుర్తు లేదు కూడా. 'శాశ్వతంగా మోడీ మాత్రమే ఈ దేశానికి ప్రధానిగా ఉండాలి' అంటూ రాజ్యాంగ సవరణ వారు చేయలేదు. కానీ.. ఎప్పటికీ మోడీ మాత్రమే ఉండేలా వాతావరణాన్ని మొత్తం అనుకూలంగా మార్చుకుంటున్నారు.ఒక కోణంలోంచి చూసినప్పుడు జమిలి ఎన్నికలు కూడా.. మోడీ నియంతృత్వ పోకడలకు నిదర్శనం అనే వాదన కూడా ఉంది. మోడీ ఎప్పుడూ కూడా తాను నియంత కావాలని ఉన్నట్టుగా చెప్పుకోరు.. కానీ, నియంతపట్ల ఉండగల భయభక్తులకు మించి అందరూ తన పట్ల ప్రదర్శించాలని కోరుకుంటారు.మంచి నియంతల లక్షణం ఇది. వారికి స్వార్థం ఉండదు. స్వలాభాపేక్ష ఉండదు. కేవలం దేశ సమగ్ర, సమున్నత ప్రయోజనాలు మాత్రమే లక్ష్యంగా ఉంటాయి. తప్పులు చేయరు. కానీ, దేశాభ్యున్నతికి తాను అనుకున్న మార్గం ఒక్కటే సరైనదని, ఎవ్వరి అభిప్రాయాన్నీ స్వీకరించాల్సిన అవసరం లేదని వారు భావిస్తారు.మంచి నియంతలు తొలిసారిగా అలాంటి నియంత అవతారం ఎత్తినప్పుడు.. ఇలా దేశం కోసమే పాటుపడతారు. కానీ.. వారి తదనంతరం ఆ నియంత పోకడ అలాగే మిగిలిపోతుంది. దానిని అందిపుచ్చుకున్న వారి వారసులు.. అంతే మంచి వారై ఉంటారనే గ్యారంటీ లేదు. అక్కడినుంచి దేశం, పరిస్థితులు భ్రష్టమార్గం పట్టిపోతాయి. మనకు అలాంటి ప్రమాదం ఎంత మేరకు పొంచిఉన్నదో ఇదమిత్థంగా తేల్చిచెప్పలేని పరిస్థితి. కుటుంబ ప్రాధాన్యం ఇసుమంతైనా కనిపించని కమ్యూనిస్టు పార్టీలు చెప్పుకోడానికి మనదేశంలో ఘనంగానే ఉన్నాయి. కానీ వాటి బలం, ప్రాబల్యం చాలా తక్కువ. అదొకరకం దుస్థితి.పాలకులలో పుడుతున్న నియంత బుద్ధులను మార్చడం అనేది ఎప్పటికీ సాధ్యం కాదు. కనీసం ప్రజాస్వామ్యం అనే పదం కింద చెలామణీలో ఉన్న మన దేశంలో ప్రజల చైతన్యం ఒక్కటే రక్ష గా నిలువగలుగుతుంది. నాయకుల ధోరణులను గమనిస్తూ వారికి బ్రేకులు వేయగలిగే తెలివిడిని ప్రజలు అలవరచుకోవాలి. నాయకుల మాటల, మాయల సమ్మోహకత్వంలో పడి ఒళ్లు మరచిపోకూడదు. ఉన్మాదంలోకి దిగిపోకూడదు. అవన్నీ వ్యక్తులుగా క్షణికోద్వేగాలను సంతృప్తి పరుస్తాయి. కానీ, అంతిమంగా దేశానికి చేటు చేస్తాయి.

# భక్తజనసంద్రంగా ప్రయాగ్‌రాజ్..





ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళ (మహా కుంభమేళా) భక్తజన సంద్రమైంది. వసంత పంచమి సందర్భంగా త్రివేణి సంగమంలో అమృత స్నానాలకు భక్తులు పోటెత్తారు. చివరి అమృత స్నానాన్ని ఆచరించేందుకు నాగా సాధువులు, స్వామీజీలు, అఖాడాలు భారీగా తరలివచ్చారు. సోమవారం తెల్లవారుజాము నుంచే చలినిసైతం లెక్కచేయకుండా పుణ్యస్నానాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా వారిపై నిర్వాహకులు హెలికాప్టర్ల ద్వారా పూల వర్షం కురిపించారు.గంగా, యమున, సరస్వతి నాదుల పవిత్ర సంగమమైన త్రివేణి సంగమంలో నిరంజని అఖాడ అధిపతి కైలాశానంద గిరి మహరాజ్, అఖాడాలకు చెందిన ఇతర సాధువులు తమకు కేటాయించిన ఘాట్‌లలో పవిత్ర స్నానాలు చేశారు. వీరితోపాటు విదేశీయులు, సాధారణ లక్షల భక్తులు సంఖ్య సంఖ్యలో తరలివస్త ప్రయాగ్‌రాజ్ మరోసారి భక్తజనసంద్రమైంది. హరహర మహాదేవ్ నినాదాలతో ఘాట్‌లు మార్మోగుతున్నాయి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ సమాచార శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 8 గంటల వరకు 62.25 లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కాగా, వసంత పంచమిని పురస్కరించుకుని 4 నుంచి 6 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.మౌని అమావాస్య రోజు జరిగిన తొక్కిసలాట ఘటన దృష్ట్యా ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. మూడంచెల భద్రత నడుమ భక్తులు అమృత స్నానాలు చేస్తున్నారు. బారికేడ్లు ఏర్పాటుచేయడంతోపాటు ఘాట్ల వద్ద సింగల్ లైన్‌లో పంపుతున్నారు. అదేవిధంగా ప్రయాగ్‌రాజ్ లోపలికి కార్లను అనుమతించడం లేదు. బయటి రాష్ట్రాలనుంచి వచ్చే భక్తుల కోసం 84 పార్కింగ్

# దూకుడు పెంచిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, బాధ్యతలు చేపట్టకముందు నుంచే పొరుగుదేశాలపై హెచ్చరికలతో కయ్యానికి కాలు దువ్విన అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు అన్నంత పనీ చేసేలాగే కన్పిస్తున్నారు. ఇప్పటికే కెనడా, మెక్సికో, చైనాలపై సుంకాలతో విరుచుకుపడిన ఆయన.. తాజాగా 'పనామా కాలువ 'పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కాలువను తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఎప్పటినుంచో హెచ్చరిస్తున్న ట్రంప్ త్వరలోనే ఇందుకు సంబంధించి కీలక పరిణామాలు ఉంటాయన్నారు. బలవంతపు చర్యలు ఉండొచ్చనే సంకేతాలివ్వడం గమనార్హం. 'పనామా కాలువను చైనా పరోక్షంగా నిర్వహిస్తోంది. మేం దాన్ని చైనాకు ఇవ్వలేదు. కానీ, ఒప్పందాన్ని పనామా ఉల్లంఘిస్తోంది. అందుకే కాలువను తిరిగి తీసుకోవాలనుకుంటున్నాం. లేదా త్వరలోనే దీనికి సంబంధించి శక్తిమంతమైన చర్య ఉండబోతోంది' అని ట్రంప్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అయితే, దీనికి బలగాల అవసరం ఉండకపోవచ్చని అన్నారు. ఇదిలాఉండగా.. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆదివారం పనామా అధ్యక్షుడు జోస్‌రౌల్ ములినోతో భేటీ అయిన సంగతి తెలిసిందే. 'పనామా కాలువ విషయంలో చైనా జోక్యాన్ని, నియంత్రణను అడ్డుకోవాలి. లేదంటే వాషింగ్టన్ తగిన చర్యలు తీసుకుంటుంది' అని ములినోతో అగ్రరాజ్య విదేశాంగ మంత్రి గట్టిగా చెప్పారు. ఈ భేటీ అనంతరం పనామా అధ్యక్షుడు మాట్లాడుతూ.. 'అమెరికా దురాక్రమణకు మేం భయపడబోం' అని తెలిపారు. చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్ట్ నుంచి తాము వైదొలుగుతున్నట్లు పనామా అధ్యక్షుడు ప్రకటించారు. ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ములినో నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో చేరేందుకు 2017లో చైనాతో చేసుకున్న ఒప్పందాన్ని తాము పునరుద్ధరించబోమని ఆయన వెల్లడించారు.

# వివాదాల్లో చిక్కుకున్న సోనియా గాంధీ



హైదరాబాద్,రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధినేత్రి, పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాక్షాత్తూ దేశ రాష్ట్రపతిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం వివాదాలకు కేంద్రబిందువు అయ్యారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఇదివరకు ఇచ్చిన ప్రసంగాన్ని ఉద్దేశించి సోనయా గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతిని పేద మహిళ అంటూ వివాదానికి తెర లేపారు. అధ్యక్షురాలు తన ప్రసంగం పాఠాన్ని చివరి వరకు కొనసాగించలేకపోయారని, అలసిపోయారని అన్నారు. పూర్ అంటూ పేర్కొన్నారు.ఈ వ్యాఖ్యల పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. రాష్ట్రపతి కార్యాలయం దీన్ని ఖండించింది. రాష్ట్రపతి పదవికి ఉన్న గౌరవానికి భంగం కలిగించేలా సోనియాగాంధీ చేసిన ఈ వ్యాఖ్యల చేశారని పేర్కొంది. అట్టడుగు వర్గాలు, రైతుల ప్రతినిధి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ తన అభ్యంతరాలు, ఆందోళనలను వ్యక్త పరిచారని తెలిపింది. పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్న నిబద్ధత ఎప్పటికీ అలసిపోదు.. అని రాష్ట్రపతి కార్యాలయం వెల్లడించింది.ఈ వ్యాఖ్యల పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఘాటు విమర్శలు చేశారు. మొట్ట మొదటి గిరిజన మహిళా రాష్ట్రపతిని, ఓ సాధారణ మహిళలను ప్రత్యక్షంగా అవమానించడమేనంటూ మండిపడ్డారు. రాచరిక కుటుంబానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రపతిని బహిరంగంగా అగౌరవపరిచిందని వ్యాఖ్యానించారు.గిరిజన వర్గాల పట్ల పార్టీకి ఉన్న తన వ్యతిరేక భావజాలాన్ని సోనియా గాంధీ బయటపెట్టారని మోదీ ధ్వజమెత్తారు. ఆదివాసీలు, గిరిజనులు, పేదరికం నుంచి అత్యుత్తమ స్థానాలను అందుకున్న వాళ్లపై తనకు ఉన్న దీర్ఘకాల పక్షపాత వైఖరిని సోనియా గాంధీ బయటపెట్టుకున్నారని మండిపడ్డారు.గిరిజనుల ప్రయోజనాలను విస్మరించడం, ఆదివాసీ వీరులను గుర్తించడంలో విఫలం కావవడం, ఈ వర్గాల కోసం ఉద్దేశించిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉంది. గిరిజన హక్కుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించిన ట్రాక్ రికార్డ్‌కు- తాజాగా ద్రౌపది ముర్ముపై సోనియా చేసిన వ్యాఖ్యలు అద్దం పట్టినట్టయిందనే విమర్శలు ఉన్నాయి.గత ఏడాది జులైలో కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి కూడా ద్రౌపది ముర్ముపై ఇలాంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. ఆమెను రాష్ట్రపత్నిగా సంబోధించారు. రాష్ట్రపతి హోదాను అవమానించారు. ఆయన వ్యాఖ్యలు.. పార్టీ భూస్వామ్య, జాత్యహంకార దృక్పథాన్ని బహిర్గతం చేశాయంటూ అప్పట్లో విమర్శలు తలెత్తాయి.రాష్ట్రపతి ఇతర ఆధిపత్య కుటుంబం నుంచి వచ్చినట్లయితే కాంగ్రెస్ ఇలాంటి అగౌరవ వ్యాఖ్యలు చేసి ఉండేదా? అనే అభిప్రాయాలు వ్యక్తమౌతోన్నాయి. ఓ గిరిజన మహిళ.. దేశంలో అత్యున్నత స్థానమైన రాష్ట్రపతి పదవిని అధిష్ఠించడాన్ని కాంగ్రెస్ ఎప్పటికీ అంగీకరించదనే అభిప్రాయాలను కలిగించినట్టయింది.

# జోగి సైలెన్స్..ఆందోళనలో జగన్

అమరావతి,నియోజకవర్గం మారినా ఆ మాజీ మంత్రి మౌనం వీడటం లేదట. ఆయన అదృష్టం ఏంటో కాని ఎన్నికల్లో ప్రతిసారి ఇష్టమున్నా లేకపోయినా ఏదో ఒక నియోజకవర్గానికి వలస వెళ్లి పోటీ చేయాల్సి వచ్చేది ఆయనకి .. అయితే వైసీపీ అధ్యక్షుడు కరుణించి ఈ సారి ఆ నాయఃకుడ్ని సొంత నియోజకవర్గానికే ఇన్చార్జ్‌గా ప్రకటించారు. అయినా కూడా పొలిటికల్‌గా యాక్టివ్ వ్వడం కాదు కదా అసలు కనిపించడమే మానేశారు. అధికారంలో ఉన్న అయిదేళ్లు పలు వివాదాల్లో చిక్కుకున్న ఆ మాజీ అమాత్యుడు. కొత్త సమస్యల్లో ఇరుక్కోవడం ఎందుకని సైలెంట్ అయిపోయారంట. అసలు ఇంతకీ ఎవరా నేత? ఎంటా స్టోరి?ఏపిలో వైసిపి ఓటమి తరువాత మాజీ మంత్రి జోగి రమేష్ మౌనవ్రతం పట్టారు. మూడు సార్లు వైసీపీ నుంచి పోటీ చేసి జోగి రమేష్ ఒక్కటంటే ఒక్కసారి గెలిచి.. జగన్ కేబినెట్లో బెర్త్ దక్కించుకున్నారు. 2014లో సొంత నియోజకవర్గం మైలవరం నుంచి పోటీ చేసిన ఆయన తన రాజకీయ ప్రత్యర్థి అయిన మాజీ మంత్రి దేవినేని ఉమా చేతిలో ఓటమి పాలయ్యారు. దాంతో ఇక మైలవరంలో జోగి రమేశ్ గెలుపు అసాధ్యమని భావించిన వైసీపీ అధ్యక్షుడు జగన్.. 2019 ఎన్నికల నాటికి ఆయన్ని పెడనకు షిఫ్ట్ చేశారు. 2009లో జోగి రమేశ్ కాంగ్రెస్ తరపున అదే పెడన నుంచి మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లోనూ విజయం సాధించి మంత్రి పదవి దక్కించుకోగలిగారు.ఇక 2024 ఎన్నికల్లో అటు మొదటి సారి వైసీపీ నుంచి పోటీ చేసిన మైలవరం, రెండో సారి పోటీ చేసిన పెడన కాకుండా జగన్ ఆయన్ని పెనమలూరుకు షిఫ్ట్ చేశారు. అక్కడ ఓడిపోయిన జోగి రాజకీయ భవితవ్యం ఏంటనేది ఆయనకే అర్థం కాకుండా తయారైందంట. జగన్ ఆయనకు మూడు సార్లు మూడు చోట్ల నుంచి టికెట్ ఇచ్చినా ఒక్కసారే గెలిచిన ఆయన ఇప్పుడు పొలిటికల్‌గా క్రాస్‌రోడ్స్‌లో నిలబడ్డారు. ఓటమి తర్వాత వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలతో జోగి అటు వైసీపీలో కొనసాగే పరిస్థితి లేక.. ఇటు కూటమి పార్టీల వైపు చూడలేక దిక్కులు చూడాల్సి వస్తుందంట.ఏపిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జోగి రమేష్ తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రదర్శించిన దూకుడుకి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అగ్రిగోల్డ్ భూముల కొనుగోలు, అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో జోగి కుటుంబంపై ఆరోపణలు రావడం, జోగి రమేష్ కుమారుడు రాజీవ్‌ని అరెస్టు చేయడం జోగి రాజకీయ భవిష్యత్తున ఒక్క కుదుపు కుదిపింది. ఒక వైపు కుమారుడి అరెస్టు., మరో వైపు జోగి రమేష్ ను విచారణ పేరుతో స్టేషన్ల రోజుల చుట్టూ తిప్పడం లాంటి పరిమాణాలు ఆయన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయంట.దాంతో జోగి రమేష్ పొలిటికల్‌గా సర్వైవ్ కాలేక ఇటు పార్టీలో యాక్టివ్ అవ్వలేక సతమతం అవుతుండటంతో .. ఆయన భవిష్యత్తులో అయినా రాజకీయంగా యాక్టివ్ అవ్వడం కష్టమే అన్న చర్చ వైసీపీ వర్గాల్లోనే పెద్ద ఎత్తున నడుస్తోందంట. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు సమయం సందర్భం లేకుండా అటు టీడీపీ, జానసేన పార్టీలని ,లోకేష్, పవన్ కళ్యాణ్‌లను టార్గెట్ చేసి తీవ్ర విమర్శలు గుప్పించారు జోగి రమేశ్. అంతేనా తన అనుచరగణంతో వెళ్లి ఏకంగా




తాడేపల్లిలోని చంద్రబాబునాయుడు నివాసంపై దాడికి ప్రయత్నించారు. ఇక కోర్టు స్వాధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను అక్రమంగా తన కొడుకు పేరట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.అప్పటి అరాచకాలకు సంబంధించి జోగి ఫ్యామిలీ విచారణలకు ఎదుర్కొంటూ కేసుల చక్రంలో ఇరుక్కుంది. ఏపిలో వైసిపి ఓటమి తరువాత రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ అధ్యక్షుడు జగన్ కంటే జోగి రమేష్ పొలిటికల్‌గా మొదట టార్గెట్ అయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీని పల్లెత్తు మాట అన్నా కూడా తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన జోగి రమేశ్ ఇప్పుడు కేసుల భయంతో అనూహ్యంగా సైలెంట్ అవ్వడంతో భవిష్యత్తులో అయినా జోగి రమేష్ అజ్ఞాతాన్ని వీడతారా లేదా అనే చర్చ పెద్ద ఎత్తున నడుస్తోంది.రెండు నియోకవర్గాల మారి ఇప్పుడు సొంత నియోజకవర్గం అయిన మైలవరం వైసీపీ ఇన్చార్జ్ బాధ్యతలు కట్టబెట్టినా కూడా జోగి సైలెంట్ గానే ఉంటున్నారు. ఒక దశలో పార్టీ మారతారని ప్రచారం జరిగినా ఆయన ఖండించలేదు. అసలు మైలవరం సెగ్మెంట్లో బయట కనిపించడమే మానేశారు. జరిగింది ఏదో జరిగింది కేసులు అందరిపై నమోదు చేశారు. అలా అని సైలెంట్ గా ఉంటే ఎలా అనే చర్చ వైసీపీలో నడుస్తుంది. కేసులు పెట్టిన తరువాత బయట అడుగు పెడితే మరిన్ని ఇబ్బందులు తెచ్చి పెట్టుకోవడం ఎందుకనే భావనలో ఉన్నారట జోగి. పార్టి తరఫున మీడియా సమావేశం పెట్టమని అడిగినా నిరాకరిస్తున్నారంట.చంద్రబాబు ఇంటిపై దాడి కేసు తన వరకు వచ్చి తన మెడకు చుట్టుకోవడం, ఆ వివాదాన్ని టీడీపీ సెంటిమెంట్‌గా తీసుకోవడంతో.. అరెస్ట్ భయంతో పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలకు, పార్టీ సమావేశాలకు సైతం దూరంగానే ఉంటున్నారట. అస్సలే ఓడామన్న బాధ , రెండో వైపు చుట్టుముట్టిన కేసులు ఆయన్ను పొలిటికల్గా ఆందోళనకు గురి చేస్తున్నాయట. అసలే ఇబ్బందుల్లో ఉంటే ఇప్పుడు ఎందుకు బయటకు రావడం అనుకుంటున్నారంట జోగి రమేష్. దాంతో మైలవరంనియోజకవర్గంలో జోగి కనిపించక, నడిపించే నాయకుడు లేక పార్టీ పరిస్థితి ఏంటన్న ఆందోళన క్యాడర్లో వ్యక్తం అవుతుంది. మొత్తానికి వైసీపీలో ఫైర్ బ్రాండ్‌గా వెలుగొందిన జోగి మౌనం ఆ పార్టీ వారికే మింగుడు పడటం లేదంట.

# ఢిల్లీ సుల్తాన్ ఎవరో?

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నికల ప్రచారపర్వం ముగిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం కోసం మూడు పార్టీలు తీరిక లేకుండా ప్రచారం చేశాయి. పుష్కరకాలంగా ఢిల్లీని ఏలుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ మరోసారి అధికారం కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతూ అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడుతున్న బీజేపీ ఈసారి ఆప్‌ను గద్దె దింపేందుకు గట్టిగానే కష్టపడుతున్నది. గత మూడు ఎన్నికల్లో ఓటముల తర్వాత ప్రభావాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఈసారి గత వైభవాన్ని పొందేందుకు శ్రమిస్తున్నది. దీంతో మూడు పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొన్నది. దేశ రాజధాని కావడంతో ఢిల్లీ ఫలితాలు దేశ రాజకీయాల్లోనూ కీలకంగా మారనున్నన్నాయి.

కేజ్రీవాల్‌పై విశ్వాసం కొనసాగుతుందా?

2013 నుంచి ఢిల్లీ ఓటర్లు లోక్‌సభ ఫలితాలు ఎలా ఉన్నప్పటికీ అసెంబ్లీకి వచ్చే సరికి కేజ్రీవాల్‌కే సీఎం కుర్చీని కట్టబెడుతున్నారు. ముఖ్యంగా ముస్లిం, దళిత, సిక్కు ఓటర్లలో, మురికివాడల్లో కేజ్రీవాల్‌కు ఆదరణ ఉన్నది. అయితే, ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు, నేతల అరెస్టులు, వలసలు, నగరంలో వాయు, నీటి కాలుష్యం, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలు ఈసారి ఆమ్ ఆద్మీకి మైనస్‌గా మారాయి.

27 ఏండ్ల తర్వాతైనా కమలం వికసించేనా?

ఢిల్లీలో 1998 నుంచి బీజేపీ అధికారానికి దూరంగా ఉంది. ఈసారి కచ్చితంగా విజయం సాధించాలనే పట్టుదలతో బీజేపీ ఉంది. ఇందుకోసం అన్ని అస్త్రాలనూ ఉపయోగిస్తున్నది. గతంలో విమర్శించిన ఆప్, కాంగ్రెస్ నేతలను పార్టీలో చేర్చుకొని టికెట్లు ఇచ్చింది. ఉచితాలకు వ్యతిరేకం అంటూనే ఢిల్లీలో భారీగా హామీలు ప్రకటించింది.

కాంగ్రెస్ ప్రభావమెంత?




2013 నుంచి ఢిల్లీలో కాంగ్రెస్ క్రమంగా ప్రభావాన్ని కోల్పోయింది. పోయిన వైభవాన్ని తిరిగి పొందేందుకు ఈసారి కాంగ్రెస్ గట్టిగానే ప్రయత్నిస్తున్నది. కొన్ని స్థానాల్లో బలమైన అభ్యర్థులను పోటీలో దింపింది.

ఈ సారి ఫలితం వన్‌సైడ్ కాదా?

ఈసారి ఫలితాలు భిన్నంగా ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత రెండు ఎన్నికలల్లో కనిపించిన ఏకపక్ష ఫలితాలు ఈసారి ఉండకపోవచ్చని చెప్తున్నారు. కాంగ్రెస్ సాధించే ఓట్లను బట్టి ఆప్, బీజేపీ గెలుపోటములు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ముస్లిం, దళితులు గణనీయంగా ఉన్న 12 స్థానాల్లో ఆప్-కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ ఉన్నట్టు చెప్తున్నారు. మిగతా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ పొందేవి ఆప్ సంప్రదాయ ఓట్లనా? ప్రభుత్వ వ్యతిరేక ఓట్లనా అనేది ఫలితాలను నిర్ణయించడంలో కీలకమని అంచనా వేస్తున్నారు.

# తెలంగాణకు శుభవార్త చెప్పిన మోదీ, దశ తిరిగినట్టే



హైదరాబాద్,రైల్వేలకు కేటాయింపులతో కూడిన కేంద్ర బడ్జెట్‌ను 01 ఫిబ్రవరి 2025 న పార్లమెంట్‌లో సమర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్ , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్, న్యూఢిల్లీ నుండి తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన కేటాయింపుల ముఖ్యాంశాలపై మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ 2025-2026 సంవత్సరానికిగాను తెలంగాణ రాష్ట్రానికి రికార్డు స్థాయిలో రూ.5,337 కోట్ల బడ్జెట్ కేటాయింపులు మంజూరు అయ్యాయని తెలియజేశారు. 2009-14 సంవత్సరాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వార్షిక సగటు బడ్జెట్ వ్యయం రూ. 886 కోట్లు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు బడ్జెట్ కేటాయింపులు 2009-14 మధ్య కాలంలో ఉమ్మడి రాష్ట్రానికి జరిగిన సగటు కేటాయింపులతో పోలిస్తే దాదాపు ఆరు రెట్లు పెరిగిందని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ రైలు అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రూ. 41,677 పెట్టుబడి పెడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ ఇప్పుడు 100% విద్యుదీకరణ చెందిందని మంత్రి తెలియజేశారు. కవచ్ ఏర్పాటులో తెలంగాణ ముందంజలో ఉందని, కవచ్ అభివృద్ధి కేంద్రం సికింద్రాబాద్‌లో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని వివిధ విభాగాలలో 1,465 కిలోమీటర్ల మేర కవచ్ వ్యవస్థ ఏర్పాటుచేయబడింది. కవచ్ తాజా వెర్షన్ 4.0 ఏర్పాటుకు ట్రయల్స్ జరుగుతున్నాయని ఆయన అన్నారు. రాబోయే 6 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం రైలు నెట్‌వర్క్‌లో కవచ్‌ను ఏర్పాటుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు .తెలంగాణ రాష్ట్రంలో 7 జిల్లాల గుండా తొమ్మిది స్టాప్‌లతో 5 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఇంకా, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలోని 40 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

50 కొత్త నమో భారత్ రైళ్లు, 200 వందే భారత్ రైళ్లు, 100 కొత్త అమృత్ భారత్ రైళ్లకు ఆమోదం లభించిందని, ఈ రైళ్ల రాకపోకలను ఎప్పటికప్పుడు ప్రకటిస్తామని ఆయన ప్రకటించారు. రైల్వేలు7,000 కిలోమీటర్ల మేర పాత ట్రాక్‌లను పునరుద్ధరించాలనే లక్ష్యాన్ని చేపట్టాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమైన విభాగాలలో 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపడానికి భారతీయ రైల్వేలు రైల్వే ట్రాక్‌లను అప్‌గ్రేడ్ చేయాలని యోచిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా, కొన్ని మార్గాలు 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని మరియు మొత్తం నెట్‌వర్క్ 100 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని పేర్కొన్నారు.

# విమానం రెక్కల్లో మంటలు..తప్పిన ముప్పు

వాషింగ్టన్,:విమానం టేకాఫ్ అవుతుండగా అకస్మాత్తుగా దాని రెక్కల్లో మంటలు చెలరేగిన సంఘటనా జార్జిబుష్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. హ్యూస్టన్ నుంచి న్యూయార్క్ వెళ్లే యునైటెడ్ ఎయిర్ లైన్స్ విమానం టేకాఫ్ అవుతుండగా ప్రమాదం జరిగింది. వెంటనే సిబ్బంది అప్రమత్తమై విమానం అత్యవసర తలుపులు తెరవడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటకు వచ్చేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు , ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని హ్యూస్టన్ ౹÷ర్ డిపార్ట్ మెంట్ తెలిపింది.ప్రమా సమయంలో విమానంలో మొత్తం 104 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బంది ఉన్నట్లు సమాచారం. వెంటనే ఎయిర్ పోర్టులోని అగ్నిమాపక వాహనాలు మంటలను ఆర్పివేశాయి.

# మంచినీటి పేరుతో కాలుష్యనీటి సరఫరా




న్యూఢిల్లీ,దేశం మొత్తం మీద పైపుల ద్వారా వచ్చే నీళ్లు ఎందుకు తాగడానికి పనికి రావడం లేదు. కాఉలుష్యం వల్ల అడపాదడపా అనేక ఘటనలు చోటుచేసుకుంటున్నారు. మంచినీటి కాలుష్యం వల్ల ప్రజల ప్రాణాల మీదకు వస్తున్నాయి. అయినా తాత్కాలిక చర్యలే తప్ప శాశ్వత చర్యలకు కేంద్ర, రాష్ట్రాలు ఉపక్రమించడం లేదు. ఇది అన్ని రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్య. ఎన్ఎస్ఎస్ఒ డేటా ప్రకారం దేశంలో దాదాపు 95 శాతం కుటుంబాలు తాగునీటి సరఫరాకు అనుసంధానంగా ఉంటున్నాయి. పైపుల నీళ్లు, గొట్టపుబావులు, రక్షితబావులు, ప్యాకేజీ నీళ్లు, ఈ విధంగా అందుతున్నాయి. అయితే ఈ విధంగా సరఫరా అవుతున్న నీళ్లన్నీ సురక్షితం అని ఎవరూ నమ్మకంగా చెప్పలేకపోతున్నారు. ప్యాకేజీ డ్రింకింగ్ వాటర్ సైతం సురక్షితంకాదని పరిశోధనలుచెబుతున్నాయి. ప్రపంచస్థాయి నీటి నాణ్యత సూచికలో మొత్తం 122 దేశాల్లో భారత్ 120వ స్థానంలో ఉందని నీతిఆయోగ్ 2018 లో వెలువరించిన తన 'కాంపోజిట్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇండెక్స్' లో వెల్లడించింది. దాదాపు 70శాతం నీళ్లు కాలుష్యపూరితంగా ప్రకటించింది. ప్రతి రోజూ నదులు, ఇతర నీటి వనరుల్లో 40 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు కలుస్తున్నాయని అంచనా. చాలా స్వల్పస్థాయిలోనే నీటి ప్రక్షాళన జరుగుతోంది. ఆ నీరు కూడా పైపుల ద్వారా ప్రవహించి చివరకు కలుషితమవుతున్నాయి. దీనికి కారణం పాతపైపులు, మురికినీరు పారే సూయెజ్ లైన్ల అనుసరించి ఈ పైపు నీళ్లు పారుతుండడం కలుషితం కావడానికి దారితీస్తున్నాయి. ప్రతిరోజూ కొన్ని గంటల వరకే పైపుల ద్వారా నీరు సరఫరా అవుతుండగా, పైపులు లీకై చాలావరకు నీళ్లుమట్టిలో కలిసిపోతుండటం పరిపాటిగా జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 1.7 బిలియన్ మంది మలమూత్రాలమయమైన నీటినే తాగునీటిగా వినియోగిస్తున్నారని 2022 లో ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. నీటిసరఫరా చెప్పుకోతగినంతగా మెరుగుపడినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా సరఫరాలో లోటు కనిపిస్తోంది. హర్ ఘర్ జల్ అన్న నినాదం మేరకు కూడా ఇంటింటికీ మంచినీటి సరఫరా పూర్తిస్థాయిలో అందడం లేదు. ఈ నేపథ్యంలో ఆయా ప్రభుత్వాలు,పార్టీలు మంచినీటి సమస్యను తమ రాజకీయ ప్రయోజనాలకోసం వాడుకుంటున్నాయి. మిషన్ భగీరథ ఓ పెద్ద మోసం అని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ తీరుపై విమర్శలు గుప్పించింది. బిఆర్ఎస్ కూడా మిషన్ భగీరథతో సురక్షిత నీటిని తెలంగాణ వ్యాప్తంగా ఇచ్చామని బుకాయించింది. 2019లో ముంబైలో పైపుల ద్వారా సరఫరా అయ్యే నీళ్లు నూటికి నూరుపాళ్లు సురక్షితమని పాలకవర్గాలు ప్రకటించాయి. కానీ అంతకుముందు వానాకాలం వచ్చేసరికి ముంబై నగరమంతా నీటి సంబంధిత వ్యాధులతో జనం అల్లాడిపోయారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ గత అసెంబ్లీ ఎన్నికల ముందు మంచినీటి సమస్యను పరిష్కరించడమే తమ ప్రాధాన్యంగా ఓటర్లకు హామీఇచ్చారు. తాగునీటి సరఫరా తలసరి వాటా 9 లక్షల లీటర్ల నుంచి 10 లక్షల లీటర్ల వరకు పెంచుతామని హామీ ఇచ్చారు. వాడుక నీటిని రీసైకిల్ చేసి మళ్లీ వినియోగించేలా చేస్తామన్నారు. కానీ చెన్నై సబర్బన్ ప్రాంతం పల్లవరంలో తుపాన్ ప్రభావంతో భారీవర్షాలు కురిసి అక్కడి మంచినీటి వ్యవస్థ దెబ్బతింది. పైపుల ద్వారా వచ్చే కలుషిత నీరు తాగి ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో 34 మంది ఆస్పత్రి పాలయ్యారు. ఈ సంఘటనలను పరిశీలిస్తే మంచినీటి సమస్యను ఎన్నికల సమయంలో ప్రచార ఆయుధంగా రాజకీయ పార్టీలు, పాలకులు ఎలా ఉపయోగించుకుంటున్నారో స్పష్టమయ్యింది.2023లో గ్రామీణ కుటుంబాల్లో కేవలం 40శాతం మాత్రమే తమ ప్రధాన నీటి వనరుగా పైపు నీళ్లను వాడుకున్నారు. అదే విధంగా అర్బన్ కుటుంబాలు 70 శాతం పైపు నీళ్లను వినియోగించారు. ఈ క్రమంలో మంచినీటిని ..మంచినీటిగా సరఫరా చేసే వ్యవస్థలను మెరుగుపర్చాలి. పకడ్బందీగా మంచినీటిని సరఫరా చేయాలి. అలా చేయడం ద్వారా ప్రజల ప్రాణాలకు, ఆరోగ్యానికి భరోసా ఇవ్వాలి.

## పదిన నామినేషన్ వేయనున్న పిడిఎఫ్ అభ్యర్థి

గుంటూరు,కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావు ఈనెల 10వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఫిబ్రవరి 27న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా లక్ష్మణరావు పోటీ చేస్తున్నారు. గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో 10వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు సభ నిర్వహించి అక్కడి నుండి భారీ ప్రదర్శనగా జిల్లా కలెక్టరేట్ కు వెళ్లి అక్కడ నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు.

# పట్టుపడితే ఇద్దరికీ నష్టమే : కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ,కేంద్ర హోంశాఖ కార్యాలయంలో ఏపీ, తెలంగాణ అధికారులు సమావేశమయ్యారు. ఇటీవల హోంశాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన గోవింద్ మోహన్ తొలిసారిగా ఏపీ, తెలంగాణ విభజన చట్టాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10లోని సంస్థల ఆస్తులు, అప్పుల బదలాయింపుపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం.దాదాపు రెండేళ్ల తర్వాత విభజన చట్టం అమలుపై హోంశాఖ లోతుగా సమీక్షించింది. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాలు సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలని హోంశాఖ సూచించింది. రెండు రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు మద్దతు ఇస్తామని హోంశాఖ తెలిపింది. నిధుల పంపకాల్లో సమస్యలపై సానుకూల దృక్పథంతో ఉండాలని హోంశాఖ తెలిపింది.ఎక్కువ వాటా కోసం పట్టుపడితే ఇద్దరికీ నష్టమేనని కేంద్ర కార్యదర్శి చెప్పినట్లు తెలిసింది. కోర్టుకు వెళితే తామేమీ చేయలేమని హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారుల స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని



సూచించినట్లు సమాచారం.అయితే, 9, 10 షెడ్యూలోని సంస్థల విషయంలో న్యాయ సలహా తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. దీనిపై వచ్చే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని హోంశాఖ కార్యదర్శి చెప్పినట్లు తెలిసింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com